జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు, దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 125 విశాఖపట్నం | బుధవారం 20 జనవరి 2021 | 8 పేజీలు | వెల : 5.00

## గాబాలో భారత్ గర్జన..

## ఆసీస్‌పై చారిత్రాత్మక విజయం



బ్రిస్బేన్,జనవరి 19, ప్రజాపాలన : టీమిండియా చరిత్ర సృష్టించింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరిగిన నాలుగో టెస్టులో భారత్ తిరుగులేని విజయాన్ని సాధించింది. గాబా పిచ్‌లో ఓటమంటే ఎరుగని కంగారూలకు గెలుపంటే ఎలా ఉంటుందో రుచి చూపించింది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్(89 నాటౌట్) ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 328 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు శుభ్‌మన్ గిల్(91) అద్భుత ఆరంభాన్నిచ్చాడు. ఆ తరువాత చటేశ్వర్ పుజారా(56) అమోఘమైన డిఫెన్స్‌తో ఆసీస్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. ఒకానొక సమయంలో పుజారాను అవుట్ చేయలేని కంగారూ బౌలర్లు అతడి శరీరానికి సైతం బంతులు వేసి బాధించారు. అయినప్పటికీ పుజారా డిఫెన్స్‌ను ఛేదించడంలో విఫలమయ్యారు. ఇక మ్యాచ్ చివరి వరకు పంత్ క్రీజులో పాతుకుపోయి భారత్‌కు మరపురాని విజయాన్ని అందించాడు. దీంతో టీమిండియా 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇదిలా ఉంటే గాబా పిచ్‌లో ఆసీస్ ఓటమంటే ఎరుగదు. దశాబ్దాలుగా ఆ పిచ్‌లో ఆసీస్‌ను ఓడించిన దేశం లేదు. ఈ విషయాన్నే మ్యాచ్ ముందు ఆసీస్‌కు చెందిన అనేకమంది మాజీలు కూడా వ్యాఖ్యానించారు. అయితే వారందరి ఆలోచనలనూ తలక్రిందులూ చేస్తూ భారత్ విజయఢంకా మోగించింది. గాబాలో విజయ గర్వంతో గర్జించింది.

# ఆ పోస్టుల భర్తీకి సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్

**తాడేపల్లి, జనవరి 19 (ప్రజాపాలన) :** వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు పథకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పథకాల్లో రుణాల మంజూరును మార్చిలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికపై మరింత దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మంగళవారం నాడు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి వ్యవస్థ ఎప్పటికీ కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెండో విడత చేయూత అందించే సమయానికి మరింత మంది సంక్షేమ పథకాల్లో వచ్చేట్లు చూడాలని సూచించారు. పశువులకు సంబంధించి పూర్తి హెల్త్ కార్డులను కొనసాగించాలన్నారు. పశువుల ఆస్పత్రులను నాడు-నేడు తరహాలో ఆధునీకరించాలని తెలిపారు. అన్ని సేవలు ఆర్బీకేల్లో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అధికారులు ప్రతిపాదనలు పంపగా వాటిని సీఎం జగన్ ఆమోదించారు.



## హార్టీ కంగ్రాట్స్ టీమిండియా : సీఎం జగన్

బ్రిస్బేన్: ఆసీస్‌తో జరిగిన నాలుగో టెస్టులో టీమిండియా 3 వికెట్ల తేడాతో స్టన్నింగ్ విజయం సాధించడంపై పెద్ద ఎత్తున ప్రశంసలు లభిస్తున్నాయి. భారత బ్యాట్స్‌మెన్ల అసమాన పోరాటం అందరిని ఆకట్టుకుంది. నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆసీస్‌ను వరుసగా రెండోసారి సొంతగడ్డపై ఓడించడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్విటర్ వేదికగా టీమిండియాపై ప్రశంసల జల్లు కురిపించారు. 'హార్టీ కంగ్రాట్స్ టీమిండియా.. ఇది నిజంగా గొప్ప విజయం. ప్రధాన ఆటగాళ్ల గైర్హాజరీలో మూడు దశాబ్దాల తర్వాత గబ్బా వేదికగా టీమిండియా విజయం సాధించి చరిత్రను తిరగరాసింది. మ్యాచ్‌లో మీరు కనబరిచిన అద్భుత ప్రదర్శన పట్ల ఈరోజు దేశం మొత్తం గర్విస్తుంది.' అని తెలిపారు.

## వారి కుట్రలను భగ్నం చేయండి : డీజీపీ

**అమరావతి, జనవరి 19 (ప్రజాపాలన) :** దేవాలయాలపై దాడులు, కేసుల ఛేదన, అరెస్టులు వంటి అంశాలపై ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. కొంత మంది ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారి కుట్రలు భగ్నం చేయాలన, ఇందుకు ఏపీ డీజీపీ విలేజ్ కమిటీల సేవలను వినియోగించుకుని ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఆలయాల పరిరక్షణకు ప్రజల సమన్వయంతో ముందుకు వెళ్లాలని, మిగతా 2లో..



## ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ పొడిగింపు

**తాడేపల్లి, జనవరి 19 (ప్రజాపాలన) :** నిఘా పరికరాల కొనుగోళ్ల అక్రమాల వ్యవహారంలో వేటుకు గురైన ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్‌ను ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలల పాటు సస్పెన్షన్‌ను పొడగిస్తున్నట్లు తెలిపింది. ఆగష్టు నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని తెలిపింది. కాగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన మిగతా 2లో..



## స్టార్టప్‌లకు కేరళ నిధుల మద్దతు



**తిరువనంతపురం, జనవరి 19 (ప్రజాపాలన) :** తమ రాష్ట్రంలోని స్టార్టప్ లకు ఆర్థిక మద్దతును ఇవ్వడానికి కేరళ ప్రభుత్వం ప్రత్యేకంగా మిగతా 2లో..

## లిబియా సంక్షోభ పరిష్కారంలో పురోగతి - ఐరాస

**న్యూయార్క్ :** దశాబ్దాల తరబడి కొనసాగుతున్న లిబియా సంక్షోభాన్ని పరిష్కరించడంలో స్పష్టమైన పురోగతి కనిపిస్తోందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భద్రతా మండలికి అందచేసిన నివేదికలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వారాంతానికి దేశం నుండి విదేశీ బలగాలు వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. గత కొద్ది మాసాలుగా కొనసాగుతున్న లిబియా అంతర్గత రాజకీయ, భద్రతా, మిగతా 2లో..

## వ్యాక్సిన్‌పై పుకార్లను నమ్మకండి: కేంద్రం

**న్యూఢిల్లీ, జనవరి 19 (ప్రజాపాలన) :** మొన్నటివరకు కరోనాకు వ్యాక్సిన్ ఎప్పుడు వస్తుందనే ఆందోళన ఉంటే, ప్రస్తుతం టీకా ఎంత మేర సురక్షితం అన్న అనుమానాలు కొందరిలో వ్యక్తమవుతున్నాయి. టీకా అందుబాటులోకి రాగానే మొదట ఫ్రంట్ లైన్ వారియర్స్‌కే ఇస్తామని కేంద్రం ఇదివరకే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో **వ్యాక్సిన్ తీసుకునేందుకు** కొందరు వైద్యసిబ్బంది వెనకడుగు వేస్తుండటంపై కేంద్రం జోక్యం చేసుకుంది. టీకా గురించి భయపడాల్సిన అవసరం లేదని, పుకార్లను నమ్మవద్దని కోరింది. కరోనా వంటి మహమ్మారికి వ్యాక్సిన్‌తోనే అడ్డుకట్ట వేయగలమని, వ్యాక్సిన్ విషయంలో ఎలాంటి సంశయం అవసరం లేదని పేర్కొంది. టీకా తీసుకున్న అనంతరం చాలా కొద్దిమందిలోనే సైడ్ ఎఫెక్ట్స్ కనిపించాయని, అయితే ఇది మిగతా 2లో..



## సీఎం జగన్ ఢిల్లీ టూర్‌లో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదు

### ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



**తాడేపల్లి, జనవరి 19 (ప్రజాపాలన) :** రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రత్యేక హోదా, పోలవరం తదితర అంశలపై చర్చించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ పర్యటన వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం నిధులు వంటి అంశాలపై మాత్రమే సీఎం జగన్ అమిత్ షాను కలుస్తారని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయటంపై ఆయన స్పందిస్తూ.. తాము బలహీనులము కాదని, అలాగే తమ బలాన్ని ఎక్కువగా అంచనా వేసుకోవడం లేదని ప్రతిపక్షాలకు చురకలంటించారు. రాజకీయ పార్టీగా తమకంటూ ప్రత్యేక విధి విధానాలు ఉన్నాయని మిగతా 2లో..

## రోడ్డు ప్రమాదాల్లో మరణాలు యూపీలోనే ఎక్కువ

### రహదారి భద్రత సమావేశాల్లో మంత్రి పేర్ని నాని



**న్యూఢిల్లీ, జనవరి 19 (ప్రజాపాలన) :** దేశ రాజధానిలో జరిగిన 32వ జాతీయ రహదారి భద్రత సమావేశాల్లో రవాణా శాఖ మంత్రి పేర్నినాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారి భద్రతా నియమాలు పాటించాల్సిన మిగతా 2లో..

మాస్టర్ కీ TV
(అంబేద్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేద్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

## సీఎం జగన్ ఢిల్లీ టూర్‌లో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. మరోవైపు కొడాలి నాని, దేవినేని ఉమ ఎపిసోడ్‌లో పూర్తి బాధ్యత టీడీపీదేనని పునరుద్ఘాటించారు. టీడీపీ నేతలు పదే పదే ఒకే అబద్ధాన్ని చెప్పి దానిని నిజం చేయాలని చూస్తున్నారని, వారి తాటాకు చప్పుళ్లకు తామేమాత్రం వెరవమని హెచ్చరించారు. దేవాలయాలపై దాడుల వెనుక ఎవరి హస్తం ఉందో, రాష్ట్ర ప్రజలకు ఇదివరకే స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో హైకోర్టు విభజన అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. రాజధాని భూముల్లో జరిగిన ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై సీబీఐ విచారణ కొనసాగుతుందని, త్వరలో నిజాలు నిగ్గు తేలుతాయని పేర్కొన్నారు. ఇందులో కిలారి రాజేష్ కేసు ఓ చిన్న విషయం మాత్రమేనని, త్వరలో పెద్ద తలకాయలు బయటకు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో మరణాలు యూపీలోనే ఎక్కువ

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాల గణాంకాల ప్రకారం.. రోడ్డు ప్రమాదాల్లో మరణాల శాతం ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే అధికమని పేర్కొన్నారు. దేశంలో యూపీలో ఎక్కువ మరణాలు నమోదవుతున్నట్లు మంత్రి తెలిపారు. కోవిడ్‌తో ఏడాదిలో 1.45 లక్షల మరణాలు నమోదు కాగా, రోడ్డు ప్రమాదాల్లో 1.51 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని మంత్రి వెల్లడించారు. కోవిడ్ మహమ్మారి కంటే రహదారి ప్రమాదాలు చాలా ప్రమాదకరమని మంత్రి హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా చనిపోతున్నారని, తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని వారు రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలు పాటించడంలో తమిళనాడును ఆదర్శంగా తీసుకుని మరణాల సంఖ్యను నివారించాలని మంత్రి పేర్నినాని విజ్ఞప్తి చేశారు.

## వ్యాక్సిన్‌పై పుకార్లను నమ్మకండి: కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

సాధారణ విషయమని నీతి అయోగ్ డైరెక్టర్లలో ఒకరైన వీకె పాల్ పేర్కొన్నారు. ఒకవేళ తీవ్ర స్థాయిలో ప్రతికూలతలు ఎదురైతే వెంటనే చికిత్స అందించడానికి ప్రతీ సెంటర్లలోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. కరోనా మహమ్మారిపై పోరాటంలో ముందుండి నడిపించిన ఫ్రంట్ లైన్ వారియర్స్.. వ్యాక్సిన్ తీసుకునే విషయంలోనే రోల్ మోడల్‌గా నిలవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ ఒక్కరూ టీకా వేయించుకోవాలని వ్లిప్తి చేశారు. భారత్‌లో కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు 3.8 లక్షల మంది వ్యాక్సిన్ తీసుకున్నారు. వారిలో 580 మందిలో సైడ్ ఎఫెక్ట్స్ కనిపించగా, ఏడుగురు ఆసుపత్రి పాలయ్యారు. ఇద్దరు మరణించారు. అయితే ఇది వ్యాక్సిన్‌కి సంబంధించి మరణాలు కాదని వైద్యులు నిర్ధారించారు. ఏడుగురు ఆసుపత్రి పాలవగా, ఇద్దరు మరణించారు. అయితే ఇది వ్యాక్సిన్‌కి సంబంధించినది కాదని కేంద్ర ప్రభుత్వం? వెల్లడించింది. ఇక గత 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 10,064 కరోనా కేసులు నమోదయ్యాయి. గత ఏడు నెలలుగా నమోదవుతున్న వాటిలో ఇదే అత్యల్పం. ఇప్పటివరకు దేశంలో 1.05 కోట్ల మందికి కరోనా సోకగా, 1,52,556 మరణాలు నమోదయ్యాయి.

## స్టార్టప్‌లకు కేరళ నిధుల మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

వెంచర్ కాపిటల్ (విసి) ఫండ్‌ను ఏర్పాటు చేసే కసరత్తులో ఉంది. ఎంటర్‌ప్రైజ్ ఫౌండర్స్ నిర్వహించిన కేరళ స్టార్టప్ మిషన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, కేరళ స్టేట్ ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కెఎస్‌ఐడిసి)లు కలిసి విసి ఫండ్‌ను అందించడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. దీని ద్వారా పాలసీ ద్వారా స్టార్టప్‌లకు ఆర్థిక మద్దతు లభించనుందన్నారు. కొత్త ఎంటర్‌ప్రైజెస్‌లను ప్రోత్సహిస్తామన్నారు. అదే విధంగా ఔత్సాహికవేత్తలుగా మార్చడానికి కావాల్సిన నైపుణ్యతలను పెంచుతామన్నారు. దేశంలోనే తొలిసారిగా కెఎస్‌యుఎం ఆధ్వర్యంలోని కేరళ స్పెసిఫిక్ ఎంజిల్ ఫండ్ ద్వారా ఇప్పటికే 11 స్టార్టప్‌లకు ఆర్థిక మద్దతును అందించామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెల్లడించారు.

## లిబియా సంక్షోభ పరిష్కారంలో పురోగతి - ఐరాస

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక చర్చలు మరింత ముందుకు సాగడంలో స్పష్టమైన ప్రగతిని సాధించామని ఆ నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ చర్చలు గణనీయమైన ఉత్తేజాన్ని ఇచ్చాయని ఆ నివేదిక పేర్కొంది. రాజకీయ, భద్రత, ఆర్థిక, అంతర్జాతీయ మానవతా చట్టం, మానవ హక్కుల రికార్డు వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోందని, శాంతి, సుస్థిరత, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొంది. లిబియా ఘర్షణలకు శాశ్వత రాజకీయ పరిష్కారాన్ని కనుగొనాలన్న కృతనిశ్చయాన్ని, దీక్షను కొనసాగించాలని ఐక్యరాజ్య సమితి సంబంధిత పక్షాలను కోరింది. ఆర్థిక సమస్యలను పరిష్కరించి, లిబియన్ల ప్రయోజనార్థం మానవతా పరిస్థితులను చక్కదిద్దాలని కోరింది. దేశం నుండి విదేశీ బలగాలు మూడు మాసాల్లో వైదొలగాలని పేర్కొంటూ 2020 అక్టోబరు 23న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలోని నిబంధనలను గౌరవించాలని ప్రాంతీయ, అంతర్జాతీయ పక్షాలను గుటెరస్ కోరారు.

## ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఏబీ వెంకటేశ్వరరావు దేశభద్రతకు ముప్పు వాటిల్లేలా డ్రోన్ల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడ్డారని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన హైకోర్టును ఆశ్రయించగా సస్పెన్షన్‌పై గతంలో స్టే ఇచ్చింది. అయితే డ్రోన్ల కొనుగోలు కుంభకోణంలో సస్పెన్షన్‌కు గురైన ఏబీని సస్పెండ్ చేయడానికి కచ్చితమైన ప్రాథమిక ఆధారాలున్నాయని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్‌లో(క్యాట్) ఇదివరకే స్పష్టం చేయడం సహా, ఏపీ ప్రభుత్వం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఏబీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నేపథ్యంలో సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఏపీ హైకోర్టు తీర్పును ఇవ్వగా.. దానిని ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ క్రమంలో ఏబీ సస్పెన్షన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌పై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించిన విషయం తెలిసిందే.

# 30 రూపాయిల పెట్రోలుకు 90 రూపాయిలా



**ముంబై, జనవరి 19 (ప్రజాపాలన) :** కరోనా వైరస్ దెబ్బకి అన్ని రకాల పన్ను వసూళ్లు దాదాపు తగ్గిపోయాయని చెప్పుకోవచ్చు. అయితే ఇక్కడ ఆ ఒక్క పన్ను వసూళ్లు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. భారీగా పెరిగాయి. ఏ పన్ను వసూళ్లు పెరిగాయని అనుకుంటున్నారా? అదే ఎక్సైజ్ సుంకం వసూళ్లు మాత్రం పైకి కదిలాయి. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ గణాంకాల ప్రకారం.. ఎక్సైజ్ డ్యూటీ వసూళ్లు 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య కాలంలో రూ. 1,96,342 కోట్లకు పెరిగాయి. 2019 ఇదే కాలంలో పన్ను వసూళ్లు రూ. 1,32,899 కోట్లుగా ఉన్నాయి. అంటే దాదాపు 48 శాతం పెరుగుదల నమోదైంది. డీజిల్ అమ్మకాలు తగ్గిపోయినప్పటికీ ఇక్కడ పన్ను వసూళ్ల పెరగడం గమనార్హం. కాగా పెట్రోల్, డీజిల్ వంటివి జీఎస్‌టీ పరిధిలోకి రావు. అందుకే కేంద్ర ప్రభుత్వం వీటిపై ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తోంది.

కేవలం కేంద్ర ప్రభుత్వం మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ విధిస్తాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని పెంచేసిన విషయం తెలిసిందే. రెండుసార్లు పెంచింది. పెట్రోల్‌పై రూ. 13, డీజిల్‌పై రూ. 16 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ రూ. 32.98కు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ రూ. 31.83కు చేరింది. మోదీ ప్రభుత్వం అధికారంలో వచ్చేటప్పటికి పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ లీటరు రూ. 9.48గా ఉండేది. డీజిల్‌పై ఇది రూ. 3.56గా ఉంది. కాగా పెట్రోల్ బేస్ ప్రైస్ లీటరుకు రూ. 27 సమీపంలో ఉంది. దీనికి ఎక్సైజ్ డ్యూటీ రూ. 32.98, డీలర్ కమిషన్ రూ. 3.67, వ్యాట్ రూ. 19.32 చెల్లిస్తున్నాం. రవాణా చార్జీల కింద రూ. 0.37 కడుతున్నాం. వ్యాట్ అనేది రాష్ట్రం ప్రాతిపదికన మారుతుంది. అందువల్ల ఒక్కో రాష్ట్రంలో పెట్రోల్ ధర ఒక్కో రకంగా ఉంటుంది

# బెజవాడలో కొడాలి వర్సెస్ దేవినేని



**విజయవాడ, జనవరి 19 (ప్రజాపాలన) :** మంత్రి కొడాలి నాని ఘాటు వ్యాఖ్యలు.. మాజీ మంత్రి దేవినేని ఉమా సవాళ్ల మధ్య బెజవాడ రాజకీయం వేడెక్కింది. గొల్లపూడి ఎన్టీఆర్ విగ్రహం వద్ద దీక్ష చేపడతానని.. దమ్ముంటే తనను టచ్ చేయాలని.. కొడాలి నానికి సవాల్ విసిరిన ఉమను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో గొల్లపూడిలో ఉద్రిక్తత తలెత్తింది. అక్కడికి భారీగా చేరుకున్న టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. 'మీ బూతుల మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా గొల్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర కూర్చుంటా అంటే ఎందుకంత భయం? టచ్ చేస్తామని సవాల్ చేసి ఒక్కడి కోసం వేలమంది పోలీసులను పంపిస్తావా? మీ ప్రభుత్వ నియంతృత్వ పాలనకు ప్రజలు భయపడరు. ప్రజాబలాన్ని అధికార దుర్వినియోగంతో అడ్డుకోలేరని తెలుసుకోండి జగన్'' అంటూ దేవినేని ఉమ ట్వీట్ చేశారు. అక్కడ భారీగా మోహరించిన పోలీసుల వీడియోను ఆయన షేర్ చేశారు. గొల్లపూడిలో సోమవారం జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొడాలి నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే.. తన చేతిలోనో లేదంటే.. కృష్ణప్రసాద్, వల్లభనేని వంశీ చేతిలోనో దెబ్బలు తినక తప్పదని దేవినేని ఉమను హెచ్చరించారు. 'మైలవరం నియోజకవర్గం వచ్చి మాట్లాడుతున్నా. ఎప్పుడైనా ఇక్కడికి వస్తా. మీ చంద్రబాబు ఏం చేశారో? మా జగన్ ఏం చేశారో చెబుతా. మీ ఇంట్లో అయినా సరే.. చర్చకు నేను రెడీ' అని ఉమకు కొడాలి నాని సవాల్ విసిరారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఇంటికొచ్చి బడితె పూజ చేస్తానని వార్నింగ్ ఇచ్చారు. మంత్రి మాటలకు ధీటుగా స్పందించిన ఉమ.. దమ్ముంటే టచ్ చేయాలని సవాల్ విసిరారు.

## ఫ్రీ స్కూల్ నిర్వహణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన



**వేటపాలెం, ప్రజాపాలన :** స్థానిక ఐసిడిఎస్ కమ్యూనిటీ హాల్లో ఫ్రీ స్కూల్ నిర్వహణకు సంబంధించిన అవగాహనా కార్యక్రమం అంగన్వాడి కార్యకర్తలకు, మహిళా పోలీస్‌లకు మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఓ కె ఉమ మాట్లాడుతూ పిల్లలకు కథలను ఏవిధంగా చెప్పాలి, విద్య సంవత్సరం లోపు ఎన్ని కథలను చెప్పాలి అనే అంశాన్ని వివరించామన్నారు. పూర్వ కాలంలో కూడా ఈ కథలను పిల్లలకు పెద్దవారు చెప్పేవారని, కథలలో పలు రకాల కథలు ఉంటాయని వీరోచిత, నీతి, హాస్య కథలు వినడంలో పిల్లలు చాలా శ్రద్ధ చూపుతారని వారికి అనుగుణంగా కథలని చెప్పాలని, ప్రతి నెలలో 15 రోజులకు ఒక కథ చొప్పున చెప్పుకుంటూ రావాలని సూచించారు. నిన్న పాటలు, నేడు కథలు, రేపు ఇండోర్ మరియు ఔట్ డోర్ గేమ్స్, నాల్గవ రోజు సృజనాత్మక కార్యక్రమాలు, ఐదవరోజు ఈ నాలుగు రోజుల కార్యక్రమం పై రీకాప్, ఇలా ఈ ఫ్రీ స్కూల్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఏ. ఇందిరా, దీపాదేవి, సూపర్ వైజర్లు,అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ నుంచి ఏపీలో క్లాసులు

**విజయవాడ, జనవరి 19 (ప్రజాపాలన) :** పీలో ఫిబ్రవరి మొదటి వారం నుంచి 1-5 తరగతులకు స్కూళ్లు పునఃప్రారంభంతో పాటు గతంలో మాదిరిగా అన్ని పీరియడ్స్ బోధించే అంశాన్ని పరిశీలించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో ఫిబ్రవరి ఒకటి నుంచి పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలని సూచించారు. మరుగుదొడ్లు లేకపోవడం, సక్రమంగా నిర్వహించకపోవడంతో చాలావరకు స్కూళ్లకు పిల్లలు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. విద్యాకానుక టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, బడులు తెరిచే నాటికి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఏడో తరగతి వారికి ఆంగ్ల మాధ్యమంలో బోధనపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. విద్యార్థులు స్కూళ్లకు రాకపోతే తల్లిదండ్రులకు సంక్షిప్త సందేశాలు (ఎస్ఎంఎస్) వెళ్లాలని సూచించారు. వాలంటీర్‌తో వారి యోగక్షేమాలు తెలుసుకోవాలని ఆదేశించారు. సచివాలయాల్లోని సంక్షేమ సహాయకులు దీన్ని పర్యవేక్షించాలి. యాప్‌లోని హాజరు వివరాలను తల్లిదండ్రులు పరిశీలించుకునే అవకాశం కల్పించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు

# నితీష్‌కు ముప్పు తప్పదా



**పాట్నా, జనవరి 19 (ప్రజాపాలన) :** బీహార్ లో అధికారంలో ఉన్న జనాదళ్ యు లో అసంతృప్తి తలెత్తు తోంది. తమ అసంతృప్తి సొంత పార్టీపైన కాదు. మిత్రపక్షమైన బీజేపీమీదనే. ఇది ప్రస్తుతం అంటుకుంది. రానున్న కాలంలో మరింత పెరుగుతుందన్నది వాస్తవం. ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నితీష్ కమార్ ఉన్నప్పటికీ బీజేపీపై విశ్వాసంతో లేరు. బీజేపీతో కలసి తాను పూర్తికాలం ముఖ్యమంత్రిగా కొనసాగలేనని ఆయన ఒక నిర్ధారణకు వచ్చినట్లుంది. దీంతో పాటు జేడీయూ ఈసారి ఎన్నికల్లో అతి తక్కువ స్థానాలను సాధించింది. దీనికి ప్రధాన కారణం బీజేపీయే నంటున్నారు ఓటమి పాలయిన నేతలు. ఇటీవల జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో తమ అసంతృప్తిని బీజేపీపై ఓటమిపాలయిన నేతలు బహిరంగంగానే వ్యక్తం చేశారు. తమ ఓటమికి ప్రధాన కారణం బీజేపీయేనని వారు నిందలు వేయడం గమనార్హం. తమ ఓటమికి బీజేపీ సహకరించకపోవడమేనని వారు చెబుతున్నారు. వాస్తవానికి చిరాగ్ పాశ్వాన్ ఆధ్వర్యంలోని లోక్ జనశక్తి పార్టీ వల్ల ఓటమి పాలయిందని తొలుత అందరూ భావించారు. ఎల్జేపీ కేవలం జేడీయూ పోటీ చేసిన స్థానాల్లోనే బరిలోకి దిగింది. దీంతో తమను ఓడించానికి ఎల్జేపీ ప్రయత్నిస్తుందని భావించిన జేడీయూ నేతలు ఆ ఓటు బ్యాంకుపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ బీజేపీ ఓటు బ్యాంకు కూడా తమకు టర్న్ కాలేదని ఎన్నికల అనంతరం జరిగిన విశ్లేషణ లో తేల్చారు. అసలు ఎన్నికలకు ముందే జేడీయూ నేతలకు బీజేపీపై నమ్మకం లేదు. లోక్ జనశక్తి పార్టీ బయటకు వెళ్లి తమపై పోటీ చేస్తామని ప్రకటించడం, అదే సమయంలో మోదీని, బీజేపీని చిరాగ్ పాశ్వాన్ పొగడటం వంటి వాటిపై బీజేపీ నేతలు పెద్దగా స్పందించలేదంటున్నారు. చిరాగ్ వల్ల నష్టం జరగలేదని, బీజేపీ వల్లనే తమకు ఎక్కువ నష్టం జరిగిందని వారు చెబుతున్నారు. బీజేపీ ఓటు బ్యాంకును లోక్ జనశక్తి పార్టీకి వెళ్లడంతోనే తాము ఓటమిపాలయ్యామంటున్నారు. మొత్తం మీద బీహార్ సంకీర్ణ ప్రభుత్వంలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్ లో అవి మరింత ముదిరే అవకాశముంది.

## టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ



**పొన్నూరు, ప్రజాపాలన :** గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రధాన మంత్రి అవాస్ యోజన వైఎస్ అర్ జగనన్న ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ మంగళవారం మునిసిపాలిటీ లోని సచివాలయాల్లో జరిగింది. ఆయా వార్డుల్లో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో పలువురు నాయకులు , అధికారులు పాల్గొన్నారు. అర్హులందరికీ ఇళ్ళు కేటాయించడం జరిగిందని నాయకులు తెలిపారు. పేద వారి కోసం ప్రభుత్వం ఇళ్లు కేటాయించడం పై లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో మిగతా పనులు పూర్తి చేసి ఇళ్ళు అందిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఆయా సచివాలయాలలో జరిగిన కార్యక్రమంలో వైకాపా నాయకులు వాద్రాణం ప్రసాద్ ,ఆకుల వెంకటేశ్వరరావు, మాజీ చైర్పరన్ రూత్ రాణి నన్నపనేని అంకినీడు చౌదరి, నాజర్, బోయిన నాగరాజు సుబాని, మునిసిపల్ కమిషనర్ పి. వెంకటేశ్వరరావు, మేనేజర్ సుబ్బారావు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

# ఆగ్నిప్రమాదంలో 16 పూరిళ్లు దగ్ధం

**శ్రీకాకుళం జనవరి 19, (ప్రజాపాలన) :** శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 16 పూరిళ్లు దగ్ధమ య్యాయి. సుమారు 25 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనలో పలువురి ఇళ్లు కాలి బూడిదయ్యాయి. బాధితులంతా కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. సమాచారం తెలుసుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని.. మంటలను అదుపు చేసినా.. ప్రయోజనం లేకపోయింది. బియ్యం, నగదు, బంగారం, చేపలు, వలలు, దుస్తులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని బాధితులంతా ఆవేదన వ్యక్తం చేశారు.

## వారి కుట్రలను భగ్నం చేయండి : డీజీపీ

(మొదటిపేజీ తరువాయి)

మత విద్వేషాలు రెచ్చగొట్టే మీడియా, సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని వివరించారు. ఆలయాలపై దాడుల్లో రాజకీయ దురుద్దేశాలు బయట పడుతున్నాయని, దానిపై ప్రత్యేక దృష్టిపెట్టి తప్పు చేసిన వారు ఎంతటివారైనా వదలొద్దని తెలిపారు. ఆధారాలతో సహా నిందితులను పట్టుకోవాలని, దాడులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని పేర్కొన్నారు.





# రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతంగా ప్రచారం చేయాలి

## నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు

**నరసరావుపేట, ప్రజాపాలన :** 32వ జాతీయ రహదారి భద్రతా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజున స్థానిక రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ సంస్థ తయారు చేసినఆడియోతో కూడిన రోడ్డు భద్రతా ప్రచార రథంను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ముప్పయి ఒక్క సంవత్సరాలుగా రహదారి భద్రతా వారోత్సవాలు జరిగేవి అని ఈ 2021లో మాత్రం ఒక నెల రోజుల పాటు ప్రజల్లో వాహనదారులలో రోడ్డు భద్రత పై అవగాహన కలిపించాలి అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నారు అని 2030 లోపు రోడ్డు ప్రమాదాల సంఖ్య యాభై శాతం తగ్గించే దిశగా పనిచేస్తున్నాయి అని అన్నారు. ఈ సందర్భంగా ఒక మహిళ స్వచ్ఛందంగా ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహకారం లేనప్పటికీ తనవంతుగా ఈ సమాజంలో రోడ్డు భద్రతా కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా అభినందించవలసిన అంశం అని పేర్కొన్నారు ముఖ్యంగా నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో సత్తెనపల్లి పిడుగురాళ్లలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు అని ఈ రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ ఆయా ప్రాంతాల్లో ఉన్న వారికి రోడ్డు భద్రతా అవగాహన కోసం ప్రచారం చెయాలి అనిఅన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవరు కి రోడ్డు భద్రత సూచనలతో కూడిన చార్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సిపి నాయకులు చింతా కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని యన్. జి. ఓ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ మాట్లాడుతూ మేము ఈ యొక్క జాతీయ రహదారిభద్రతా కార్యక్ర మాన్ని ఈ నెల రోజులు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యన్. జి. ఓ సభ్యులు కోటేశ్వర రావు, సాంబశివరావు, బాషా, బంగారయ్య లు పాల్గొన్నారు.

## మాజీ రేషన్ డీలర్‌కు ఉచిత వైద్యం



**నరసరావుపేట, ప్రజాపాలన :** రొంపిచర్ల మండలంలో అన్నవరం గ్రామానికి చెందిన మాజీ రేషన్ డీలర్ టిడిపి నాయకులు రాపూరి సాల్మన్ రాజుకు మంగళవారం నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ డా. చదలవాడ అరవింద బాబు ఉచితముగా వైద్యం చేశారు. ఆ గ్రామానికి చెందిన మాజీ రేషన్ డీలర్ సాల్మన్ రాజు గత కొద్ది నెలలుగా మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. పేదకుటుంబమునకు చెందిన సాల్మన్ రాజు వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన మండల టిడిపి నాయకులు పచ్చవ కోటేశ్వరరావు నియోజకవర్గ టిడిపి ఇన్-చార్జ్ డా. చదలవాడ అరవింద బాబు దృష్టికి తీసుకురావటం జరిగింది. ఈ విషయమై స్పందించిన డా. అరవింద బాబు నరసరావుపేట లో గల తన హాస్పిటల్ లో సాల్మన్ రాజుకు ఉచితముగా ఆపరేషన్,వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్న తనకు ఉచితముగా ఆపరేషన్ చేసి మందులు ఇచ్చిన డా. అరవింద బాబుకు సాల్మన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. మండల టిడిపి నాయకులు వెన్న బాల కోటి రెడ్డి,పచ్చవ కోటేశ్వరరావు,పులుకూరి జగ్గయ్య, తదితరులు డా. అరవింద బాబుకు అభినందనలు తెలిపారు.

# నరసరావుపేట నియోజకవర్గంలో కన్నుల పండుగగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు




- ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్-ఛార్జ్ డా. చదలవాడ
- గ్రామాలలో అధిక సంఖ్యలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు
- చదలవాడ ఘన స్వాగతం పలికిన గ్రామ నాయకులు కార్యకర్తలు అభిమానులు

**రొంపిచర్ల. ప్రజాపాలన :** తెలుగు జాతి గర్వించే నేత దివంగత నేత నందమూరి తారక రామారావు అని నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్-చార్జ్ డా. చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని నియోజకవర్గంలోని జొన్నలగడ్డ,పమిడిపాడు, కేత ముక్కల అగ్రహారం, ములకలూరు, కేసనపల్లి, ఎలమంద,చిన్న తురకపాలెం, చింతలపాలెం, గోనేపూడి, గురవాయపాలెం, కాకాని, అల్లూరివారిపాలెం, తుంగపాడు గ్రామాలలో విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలుచోట్ల రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ ఆశయసాధన కోసం కష్టపడి పని చేయాలని నియోజకవర్గ నేత డా. చదలవాడ చదలవాడ అరవింద బాబు కోరారు. ఆయా గ్రామాలలో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

## పాస్టర్లందరూ భారత రాజ్యాంగాన్ని ప్రతిని కలిగి ఉండాలి : డాక్టర్ ముల్లర్



**చందర్లపాడు, జనవరి 19 ప్రజాపాలన :** చందర్లపాడులోని షాలేము ప్రార్థనా మందిరమునందు నేషనల్ క్రిస్టి యన్ కౌన్సిల్ మండల సర్వసభ్య సమావేశము మం డల అధ్యక్షులు ఎస్. ఆర్. కుమార్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నే షనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొ క్కా జార్జి ముల్లర్ మాట్లాడుతూ ప్రతి క్రైస్తవుడు విధి గా బైబిల్ ను కలిగి ఉండాలని,అదేవిధంగా భారత రాజ్యాంగం ప్రతిని కూడా ఖచ్చితంగా కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను వినియోగించు కుంటునే పరమత సహనాన్ని, మతసామరస్యాన్నిఖ చ్చితంగా పాటించి సమాజానికి మంచి సందేశాన్ని అందించాల్సిన బాధ్యత పాస్టర్ ల మీద ఉన్నదని తె లియజేశారు .కోస్టల్ రీజన్ కోఆర్డినేటర్ పాల్ శంకర రెడ్డి,కృష్ణా జిల్లా అధ్యక్షులు హనోకు,జిల్లా ప్రధాన కా ర్యదర్శి హిజ్కీయ రాజు,బెంజిమెన్, చందర్లపాడు మండల ప్రధాన కార్యదర్శి పాల్ వినీల్, దేవరాజు,దేవ సహాయం, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి



**వేటపాలెం, ప్రజాపాలన :** విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ వివేకానంద కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వివేకానంద కాలనికి చెందిన మునగాల చిన్న, భవాని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు కార్తీక్(9) కేరళలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం కుందేరు అంచున ఇంటి స్థలాల ఫ్లాట్ లలో ఇతనితో పాటు జ్యోనాథ్ అనే 12 సంవత్సరాల బాలుడు కలసి గాలిపటాలను ఎగరేస్తున్నారు. ఈ సమయంలో గాలిపటం సమీపంలో ఉన్న విద్యుత్ ప్రధాన తీగల్లో ఇరుక్కుపోయింది. దీంతో ఆ గాలిపటాన్ని తీసేందుకు కార్తీక్ గోడ పైకి వైర్ల మధ్యలో ఉన్న గాలిపటాన్ని తీయబోగా వీరిద్దరికీ విద్యుత్ షాక్ తగిలింది. దీంతో కార్తీక్ అక్కడే మృతి చెందగా జోయంత్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం ఒంగోలు తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే రెండో పట్టణ సీఐ పాపారావు ఎస్సై శ్రీకాంత్ రత్నకుమారి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఘటన గల కారణాలను అడిగి తెలుసుకున్నారు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హత ఉన్న అందని అమ్మ ఒడి

**నకరికల్లు. ప్రజాపాలన :** నకరికల్లు మండలంలో అర్హత ఉన్న అమ్మ ఒడి పొందలేక పోతున్నా లబ్ధిదారు లు నకరికల్లు మండలం లో అమ్మ ఒడి అర్హత ఉన్న పొందలేకపోతు న్నారు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కొంతమంది తల్లిదండ్రులు ఈనెల అమ్మ ఒడి పథకం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం కొంతమందికి అమ్మ ఒడి పథకం లో అకౌంట్ నెంబరు తేడా రావడం వలన వాళ్ల కు డబ్బులు పడకపోవడం వలన నిరసనగా గురవుతున్నారు జగను అమ్మ ఒడి పథకం ఎంతో పటిష్టం గా ప్రారంభించారు. అయినా కొంత మందికి అర్హత ఉన్నా నా డబ్బులు రాకపోవటం వలన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అన్ని అన్ని కరెక్ట్ గా ఉన్నా మెసేజ్ మాత్రం అమ్మ ఒడి పథకం మీరు లబ్ధి పొందారు అన్న మెసేజి వాళ్ళకు వచ్చిన వాళ్లకు ఎకౌంట్లో డబ్బులు పడటం లేదు కొన్నిచోట్ల అకౌంట్ నెంబర్లు తేడా గా ఉన్నాయి అని తెలియపరి చిన ఇలాంటి విషయాలు మొత్తం హెడ్మాస్టర్ లకు మరియు ఎం ఈ ఓ ఆఫీస్ కి తెలియపరిచిన మాకు అర్థం కావటం లేదు అని సమాధా నం చెబుతున్నారు అన్ని అర్హత ఉన్నా లబ్దిపొందే లేక పోతున్నా అన్న బాధ ఆ తల్లిదండ్రులకు విద్యార్థు లకు బాధ కలిగిస్తుంది వాళ్లకు అర్థం కాకపోయినా పై స్థాయి అధి కారులు ఏమన్నా మాకు న్యాయం చేస్తారేమో అని ఆశతో తల్లిదండ్రు లు విద్యార్థులు ఉన్నారు.

## పంటకోత ప్రయోగాలతో రైతుకు పలు రకాల లాభాలు చేకూరతాయి

**వేటపాలెం, ప్రజాపాలన :** పంట కోత ప్రయోగాలతో రైతులకు పలు రకాల లాభాలు చేకూరతాయని మండల వ్యవసాయాధికారి ఐ. కాశీ విశ్వనాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ని రైతు నూనె కోటేశ్వరరావు - ఎన్ ఎల్ ఆడ్ 3389 రకం పంట కోత ప్రయోగాలను ఏఇఓ ఎం. గోపికృష్ణ, గ్రామవ్యవసాయ సహాయకులు వివనాగబాబు, రామారావు, వినయ్ 25 చ.మీ. లో గల వరి పంటను కోసి నూర్చి 12635 కిలోలు అనగా సుమారు రైతు సరాసరి దిగుబడి ఎకరానికి 27.30 బస్తాలు వచ్చినట్లు వెల్డించారు. గ్రామ యూనిట్ క్రింద గ్రామ సరాసరి దిగుబడికి తక్కువ వచ్చిన యెడల డా. వై యస్ ఆర్ ఫ్రీ క్రాప్ ఇన్సూరెన్సు వర్తించబడునని తెలిపారు. దీని ప్రకారం రాష్ట్ర దిగుబడి ని గణాంకాధికారులు లెక్కించి తెలియపరచటం జరుగుతుందని తెలిపారు.

# దేవాలయాల వద్ద పోలీస్ నిఘా ఏర్పాటు: డిఎస్పీ శ్రీకాంత్




**వేటపాలెం, ప్రజాపాలన :** ఇటీవల రాష్ట్రంలో కొన్ని దేవాలయాల్లో చోటు చేసుకున్న పరిణామాల దృష్ట్యా ఆలయాల వద్ద గట్టి పోలీస్ నిఘా ఏర్పాటు చేసున్నామని చీరాల రూరల్ డిఎస్పీ శ్రీకాంత్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిద్ధార్ కౌసిల్ ఆదేశానుసారం మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలోని దేవాలయాల భద్రత నిమిత్తం నిఘా టీమ్ లు ఏర్పాటు చేశామని, అలగే ఆలయ ప్రాంగణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని దేవాలయ కమిటీ సభ్యులను విజ్ఞప్తి చేశారు. వేటపాలెంలో పరిస్థితి బాగున్నప్పటికి, దేవాలయ కమిటీలను, రెవిన్యూ అధికార బృందాలను, మహిళా పోలీస్ లను, వీఆర్వోలను, వాలిం టీర్లలు అందరూ దేవాలయాల భద్రత కోసం జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కొన్ని దేవాలయాలకు మాత్రమే సిసి కెమెరాలు అమర్చి ఉన్నాయని, మిగిలిన దేవాలయాల విషయంలో తగు జాగ్రత్తలను తీసుకో వాలని, అందుకు అందరు కలసికట్టుగా బాధ్యతలను తీసుకుని దేవాలయాల రక్షణకు శ్రమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ ఎం. రోశయ్య, ఎస్ఐ కె కమలాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 20 జనవరి 2021

# మద్దతు ధరలతో పర్యావరణ లబ్ధి

వ్యవసాయ ఉత్పత్తులకు చట్టబద్ధమైన కనీస మద్దతు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వివిధ పంటల దిగుబడులకు ఎట్టి పరిస్థితులలోను కనీస లాభదాయక ధర లభించేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వాలనేది ఈ డిమాండ్ లోని ప్రధాన అంశం. మరొక దృష్టికోణం నుంచి కూడా ఈ డిమాండ్‌ను చూడవలసి ఉంది. మన నదులను నిత్యం సజీవంగా ఉంచేందుకు కనీస మద్దతు ధరను ఒక సాధనంగా చేసుకోవలసి ఉంది. అదెలాగో వివరిస్తాను.

నదులు కాలుష్యరహితంగా, స్వచ్ఛ వాహినులుగా ఉండాలంటే వాటిలో ఎల్లప్పుడూ తగినంత నీరు ప్రవహిస్తూ ఉండాలి. మనిషి ఆరోగ్యవంతుడుగా ఉండడానికి అతని శరీరంలో తగినంత రక్తం ఉండడం ఎంత అవసరమో నది సజీవంగా ఉండేందుకు అందులో సదా తగినంత నీరు ప్రవహిస్తుండడం కూడా అంతే అవసరం. పంటలసాగుకు నదీజలాలను ఉపయోగించుకోవడం రైతుల హక్కు. ఈ హక్కును సాకారం చేసేందుకు ప్రభుత్వాలు తమ శాయశక్తులా కృషి చేస్తున్నాయి. నదీ జలాలపై మరో హక్కుదారు సాక్షాత్తు ఆ ప్రకృతి వనరే. అంటే నది, వివిధ జలచరాలు, జలసంబంధ వృక్షజాతుల మనుగడకు, నదీశోభను ఆస్వాదించేందుకు, మతాచారాల నిర్వహణకు నదులు సదా నిండుగా ప్రవహించడం అవసరం. నదిలో సహజ ప్రవాహాన్ని 'పర్యావరణ ప్రవాహం' (ఎన్విరాన్మెంటల్ ఫ్లోస్) అంటారు. జలశాస్త్రవేత్తలు దీనినే క్లుప్తంగా ఈ-ఫ్లోస్ అంటారు. ఒక నదిని సజీవంగా ఉంచేందుకు ఈ-ఫ్లోస్ ఏ పరిమాణంలో అవసరం అన్న విషయమై పలు అధ్యయనాలు జరిగాయి. గంగానదికి సంబంధించి ఈ విషయాలను ప్రస్తావిస్తాను. అయితే అదే తర్కం ఇతర నదులకు కూడా వర్తిస్తుంది.

గంగానదిలో 29 నుంచి 67 శాతం మేరకు పర్యావరణ ప్రవాహం ఉండాలని కొలంబోలోని 'అంతర్జాతీయ జల నిర్వహణ సంస్థ' (ఐడబ్ల్యు ఎమ్ఐ) 2006లో సూచించింది. ఈ విషయంలో సీనియర్ న్యాయవాది అరుణ్ కుమార్ గుప్తా (ఈ వ్యాస సహ రచయిత) వాదనలు విన్న అనంతరం నరోరా జలాశయం నుంచి 50 శాతం నీటిని తప్పనిసరిగా విడుదల చేయాలని అలహాబాద్ హైకోర్టు 2011లో ఒక ఆదేశాన్ని జారీ చేసింది. కాన్పూర్‌కు ఎగువున ఉన్న భిథూర్ జలాశయం నుంచి 47 శాతం నీటిని విడుదల చేయాలని 2012లో 'వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్' 2012లో సిఫారసు చేసింది. చిల్లా జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుకు గంగాజలాలను మళ్ళిస్తున్న పశులోక్ బ్యారేజ్ నుంచి 55 శాతం నీటిని విడుదల చేయాలని ఏడు ఐఐటీల కన్సార్టియం సిఫారసు చేసింది. జల్‌శక్తి మంత్రిత్వశాఖ 2015లో రూపొందించిన నివేదిక ఒకటి ఐఐటీల సిఫారసును సమర్థించింది.

భీమ్‌గోడ బ్యారేజ్ నుంచి 36 నుంచి 57 క్యుమెక్స్ (క్యూబిక్ మీటర్స్ పర్ సెకండ్) నీటిని విడుదల చేయవలసిన అవసరముందని 2018 అక్టోబర్‌లో జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బిజ్నోర్, నరోరా, కాన్పూర్ దిగువ ప్రాంతాలకు 24 నుంచి 48 క్యుమెక్స్ నీటిని ఈ-ఫ్లోస్‌గా విడుదల చేయాలని ఆ మంత్రిత్వశాఖ నిర్దేశించింది. ఆయా జలాశయాలలో లభ్యమయ్యే మొత్తం నీటిలో ఇది 6 శాతం. ఇప్పటికీ అమల్లో ఉన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని, ప్రస్తావిత అధ్యయనాల సిఫారసులు, సూచనలను జల్ మంత్రిత్వశాఖ ఉపేక్షించిందని అర్థమవుతోంది.

మనకు ఆహారభద్రత ఎంత అవసరమో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. సమస్య ఏమిటంటే ఈ రెండిటిలో ఏదో ఒక దానివైపు మనం మొగ్గవలసిన సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నాం. ఎందుకని? మన రైతులు తమ పంటపొలాల సాగుకు కాలువల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని దుర్వినియోగపరుస్తున్నారు. అవసరమైన దాని కంటే ఎక్కువ నీటిని తమ పొలాల్లోకి పారించుకుంటు న్నారు. దీనివల్ల అవసరాలకు మించి భారీ పరిమాణంలో సాగుజలాల సరఫరా ఆవశ్యకమవుతోంది. రైతులు తాము ఉపయోగించుకునే నీటికి విధిగా నిర్దిష్ట మొత్తంలో ధర చెల్లింపును అనివార్యం చేయడమే సమస్యకు పరిష్కారం. దీనివల్ల వారు సాగునీటిని వృథా చేయకుండా అవసరాల మేరకు ఉపయోగించుకుంటారు. తక్కువ నీటిని ఉపయోగించుకోవడం ద్వారా దేశానికి ఆహార భద్రతనూ సమకూర్చగలుగుతారు. అయితే ఉపయోగించుకున్న సాగునీటికి ధర చెల్లించవలసిరావడం వల్ల రైతుల ఉత్పత్తి ఖర్చులు విధిగా పెరుగుతాయి. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు పరస్పరానుగుణంగా కనీస మద్దతు ధరను పెంచడం ద్వారా సాగువ్యయాల సమస్యను అధిగమించవచ్చు. రైతులు తాము ఉపయోగించుకునే సాగునీటికి ధర చెల్లించవలసి ఉంటుంది. అయితే పంట దిగుబడుల విక్రయాల ద్వారా వారు తమ ఉత్పత్తి ఖర్చుల కంటే ఎక్కువ ఆదాయాన్ని పొందగలుగుతారు.


కనీస మద్దతు ధర పెంపుదల అంతిమ భారం పట్టణ, నగరవాసులపై పడుతుంది. వాళ్లు తమకు అవసరమైన సకల ఆహారపదార్థాలను మార్కెట్ నుంచి కొనుగోలు చేసుకోవలసి ఉండడంతో అధిక ధరలభారాన్ని మోయవలసి ఉంటుంది. కనీస మద్దతు ధర పెరిగినందున పట్టణ వాసులు విధిగా తమ ఆహారానికి మరింత అధికంగా ఖర్చుచేయవలసి ఉంటుంది. ఇప్పుడు మన ముందు ఒక సమస్య ఉన్నది. చౌక ఆహారధాన్యాలనో లేదా సజీవనదులనో మనం కోరుకోవాలి. తాము దేనిని కోరుకొంటున్నారో ప్రజలే నిర్ణయించుకోవాలి. చౌక ఆహారధాన్యాలను కోరుకునే వారూ, అలాగే జలచరాల, జలసంబంధమైన వృక్షజాతులు, మత్స్యకారుల జీవనాధారాల మనుగడను నదిశోభను కోరుకునేవారూ ఉంటారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని 50 శాతం నీటిని విడుదల చేయాలన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాన్ని జల్ శక్తి మంత్రిత్వశాఖ ఎట్టి పరిస్థితులలోనూ అమలుపరచకూడదు. ప్రస్తావిత అధ్యయనాల సిఫారసులనే అమలుపరచాలి. అదే సమయంలో రైతులపై సాగునీటి ధర భారం ఏ మేరకు ఉంటుందో అంచనా వేసి, అందుకు అనుగుణంగా కనీస మద్దతు ధరను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

## కరోనాపై పోరులో క్యూబా ఆదర్శం

ప్రపంచం యావత్తూ కరోనా పై పోరులో సతమతమౌతోంది. ముఖ్యంగా ప్రజావైద్యాన్ని సైతం ఒక వ్యాపారంగా దిగజార్చిన అమెరికా, బ్రిటన్ తదితర సంపన్న దేశాలు, తమ నియంతృత్వ విధానాలతో ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా కార్పొరేట్ల సేవలోనే మునిగి, తేల్తూ వున్న మోడీ, బోల్సనారో వంటి నాయకుల పాలనలో ఉన్న దేశాలు తమ ప్రజలను కరోనా నుండి రక్షించడంలో ఘోరంగా విఫలమయాయి. ఇటువంటి తరుణంలో, నాలుగు దశాబ్దాలుగా అమెరికా ఆర్థిక ఆంక్షలకు గురవుతూ, పలు ఇక్కట్లలో ఉన్న సోషలిస్టు క్యూబా ప్రజలను ఆదుకోవడంలో యావత్ ప్రపంచానికే ఒక ఆదర్శంగా నిలిచింది. క్యూబా జనాభా ఒక కోటి 20 లక్షలు. ఏ కోణం నుండి చూసినా క్యూబాను సంపన్న దేశం అని అనలేము. 1959లో క్యూబన్ ప్రజలు సాధించుకున్న విప్లవాన్ని అమెరికా కుట్రల నుండి కాపాడుకోడానికే తన సర్వ శక్తులనూ వినియోగించవలసి వస్తున్నది. ఈ కరోనా క్లిష్ట పరిస్థితులలో సైతం అమెరికా క్యూబాకు ఇతర దేశాలు పంపిన అత్యవసర సరుకుల ఓడలను నిలిపివేసింది. క్యూబాతో లావాదేవీలు నిలిపివేయకుంటే తీవ్ర చర్యలు తప్పవని పలు దేశాలను హెచ్చరించడంతో చాలా దేశాలు వెనక్కి తగ్గాయి. చైనా నుండి క్యూబాకు పంపిన నౌకను మధ్యలోనే అమెరికా తన అధీనంలోకి తీసుకుంది. ఇన్ని దారుణాలను తట్టుకుంటూ క్యూబా ఏం చేసిందో చూద్దాం. తక్కిన దేశాలేవీ ఇంకా కరోనా ముప్పు గురించి పట్టించుకోక మునుపే 2020 జనవరి రెండో వారం లోనే క్యూబా తన కార్యాచరణను ప్రారంభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరికలను క్యూబన్ మీడియా విస్తృతంగా ప్రజలలోకి తీసుకుపోయింది. జనవరి 24న నేషనల్ వర్కింగ్ గ్రూప్ ఏర్పడింది (మన మోడీ మార్చి నెల 23 వరకూ స్పందించనేలేదు).దేశంలో ఇంకా ఒక్క కేసు కూడా నమోదు కాకపోయినా, జనవరిలోనే 95,000 మంది డాక్టర్లకు, 86,000 మంది నర్సులకు కరోనాను గుర్తించడం, వైద్యం అందించడం గురించి శిక్షణ ఇచ్చారు (ఒక కోటి 20 లక్షల జనాభాలో 95 వేల మంది వైద్యులు ఉన్నారు. అంటే దాదాపు ప్రతి 125 జనాభాకు ఒక డాక్టరున్నారు.) ఫిబ్రవరి నెలలో ప్రజానీకానికి కరోనా వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పూర్తి అవగాహన కల్పించారు. అప్పటికి ఆ దేశంలో ఇంకా ఒక్క కేసూ నమోదు కాలేదు. మార్చి 10న ఒక విదేశీ టూరిస్టుకు కరోనా సోకినట్టు గుర్తించారు. వెంటనే క్యూబా లోని 13 మెడికల్ కాలేజీలలోని విద్యార్థులను ఇంటింటి ప్రచారంలోకి పంపారు. మార్చి 15కల్లా ఆ బృందాలు దేశ జనాభాలో సగం మందిని, అంటే 60 లక్షల మందిని సర్వే చేసేశాయి. మార్చి 20 నాటికి మొత్తం కేసులు 21కి చేరాయి. వెంటనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన భౌతిక దూర నిబంధనలను అమలు చేయడం ప్రారంభించారు. సుమారు 60 వేల మంది విదేశీ టూరిస్టులను వెనక్కి పంపారు. ఒక ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న టూరిజం మీద దీని ప్రతికూల ప్రభావం తీవ్రంగా పడింది. అయినా, క్యూబా తన ప్రజల ఆరోగ్యానికే ప్రథమ ప్రాధాన్యతనిచ్చింది. దేశంలో ప్రైవేటు వ్యాపారులు చెల్లించవలసిన పన్నులను నిలుపుచేసింది. లాక్‌డౌన్ వలన పనులు కోల్పోయిన కార్మికులకందరికీ మొదటి నెల పూర్తి జీతాన్ని చెల్లించింది. ఆ తర్వాత నెలనుండి 60 శాతం జీతాన్ని చెల్లిస్తూ వచ్చింది. ప్రైవేటు రంగం లోని కార్మికులకు జాతీయ కనీస వేతనాలు గ్యారంటీ చేసింది. నైబర్‌హుడ్ స్టోర్స్ ద్వారా దాదాపు 40 లక్షల కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, వంటనూనె, గుడ్లు, చక్కెర సరఫరా చేసింది. ఏప్రిల్ 6 నాటికి మొత్తం కేసులు 396 కి చేరాయి. దాంతో అత్యవసర సర్వీసులు మినహా తక్కిన ఆర్థిక కార్యకలాపాలనన్నింటినీ నిలిపివేసింది. ప్రజలు తాగునీరు, విద్యుత్తు, వంట గ్యాస్ కోసం చెల్లించవలసిన చార్జీలను రద్దు చేసింది. ఈ చర్య శ్రామిక ప్రజలకు గొప్ప ఊరట కలిగించింది. జనవరి 2021 నాటికి క్యూబాలో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 13000 దాటలేదు. మరణాలు ఆనాటికి 147 మాత్రమే. ప్రపంచంలోనే అతి తక్కువ శాతం మరణాలు సంభవించిన దేశాలలో క్యూబా ఒకటి. యువజన, మహిళా, విద్యార్థి సంఘాలు కరోనా గురించి అవగాహన కల్పించడంలో, ఆహార సరఫరాలో, ఇంటింటి సర్వేలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. క్యూబాలో వెల్లడైన సహకార స్ఫూర్తి ఏ పెట్టుబడిదారీ దేశంలోనూ కానరాదు. చైనాకు, పలు ఇతర దేశాలకు అవసరమైన మందులను ఈ కాలంలో క్యూబా సరఫరా చేసింది. 1,50,000 డబుల్ డోసుల ఇంటర్‌ఫెరాన్ ఆల్ఫా 2బి డోసులను చైనాకు అందించింది. హెన్రీ రీవ్ ఇంటర్నేషనల్ మెడికల్ బ్రిగేడ్ నుంచి దాదాపు 25 దేశాలకు వైద్య బృందాలను పంపింది. ఇటలీ, బార్బడోస్ తదితర దేశాలకు వెళ్ళిన వైద్య బృందాలు అక్కడ వైద్యం అందించడంతో బాటు అక్కడి వైద్యులకు శిక్షణ కూడా ఇచ్చాయి. ఇటువంటి విశిష్టమైన రీతిలో సేవలు అందించినందుకు క్యూబన్ డాక్టర్లకు నోబెల్ శాంతి బహుమతిని ఇవ్వాలని పలు సంస్థలు, మేధావులు కోరారు. కాని అమెరికా మాత్రం ఆ వైద్యుల సేవలను నిరాకరించడమే కాకుండా తన మిత్ర దేశాలేవీ క్యూబన్ డాక్టర్ల సేవలను వినియోగించుకోరాదని ఆంక్షలు పెట్టింది. ఎం.ఎస్.బ్రేమర్ అనే బ్రిటిష్ పాసింజర్ల నౌక 682 మంది ప్రయాణీకులతో ఉండి, అందులో పలువురికి కరోనా సోకింది. ఏ ఇతర దేశమూ ఆ నౌకను తమ రేవులలోకి రానివ్వలేదు. కాని క్యూబా మాత్రం అత్యున్నతమైన సోషలిస్టు మానవతా స్ఫూర్తిని ప్రదర్శించింది. ఆ నౌకను అనుమతించడం వలన కలిగే రిస్కులు తీవ్రంగా ఉంటాయని తెలిసినా, అందులో చిక్కుకున్న ప్రయాణీకులను కాపాడేందుకే సిద్ధపడింది. వారందరికీ వైద్యం అందించింది. తిరిగి సురక్షితంగా బ్రిటన్ పంపింది. గత ఆగస్టులోనే క్యూబా తన మొదటి వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేసింది. అదే సొబెరనా-1. ఆ తర్వాత మరో మూడు వ్యాక్సిన్ లను తీసుకు వచ్చింది. ఇవన్నీ వివిధ దశల ప్రయో గాలలో ఉన్నాయి. ఫిబ్రవరి 2021నాటికి తన దేశ ప్రజలకందరికీ వ్యాక్సిన్ లను అందిస్తామని క్యూబన్ ప్రభుత్వం ప్రకటించింది.

# రగులుతున్న రాయలసీమ

మొన్నటి ఎన్నికల్లో శత కోటి ఆశలతో వైకాపా గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన రాయలసీమ నేడు కుతకుతలాడిపోతోంది. 51 శాసనసభా స్థానాల్లో 49 స్థానాలు కట్టబెట్టామని సోషల్ మీడియాలో గణాంకాలు పొందుపర్చి తమ ఆవేదనలను వెలిబుచ్చుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా తాము ఆశించిన అభివృద్ధి కన్పించడం లేదని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వలస బతుకులు అంతం కావాలని తమ ప్రాంతం కూడా పాడి పంటలతో వర్ధిల్లాలనే ఆకాంక్ష వారిది. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించాలని, ఆగిన ప్రాజెక్టులు పూర్తి చేసి నికరజలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.




ఈ అసంతృప్తి ఒక్కో సమయంలో ఎంతవరకు వెళ్తున్నదంటే ప్రత్యేక రాష్ట్రం తప్ప మరో మార్గం లేదనే భావజాలానికి ఎక్కువమంది లోనవుతున్నారు. న్యాయ రాజధాని కనుచూపు మేర కన్పించకపోగా, న్యాయంగా కర్నూలులో ఏర్పాటవుతుందని అనుకున్న కృష్ణ యాజమాన్య బోర్డు కేంద్ర కార్యాలయం విశాఖలో ఏర్పాటుకు ప్రకటన వెలువడగానే సీమవాసులు ఆగ్రహిస్తున్నారు. టిడిపి హయాంలో సీమ పరిరక్షణ కోసం పోరాడిన వివిధ ప్రజా సంఘాల నేతలు తాము ఊహించిన ఆశల సౌధాల కోటగోడలు ఒక్కొక్కటిగా కూలి పోతుండగా 'వికేంద్రీకరణ' అంటే ఇదేనా అని మధనపడటం మొదలైంది. ఇంతకాలం గళం విప్పిన మేధావులు ఇప్పుడు మౌనం దాల్చడంపై మరి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు. ఎంతో అట్టహాసంగా ప్రకటించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం విస్తరణ పనులకు బ్రేక్ పడి నెలలు గడుస్తున్నా పరిష్కారం లభిస్తుందనే నమ్మకం సడలి పోతున్న దశలో గుండ్రేవుల రిజర్వాయర్‌కు టెండర్లు పిలిచారు. ఇది కొత్త పథకమని ఇంజనీరింగ్ చీఫ్ కృష్ణ యాజమాన్య బోర్డుకు లేఖ రాయడం సీమ ప్రజలకు అప్పట్లోనే పుండుపై కారం రాసినట్లయింది. అప్పటికీ భరించారు. కాని యాజమాన్య బోర్డు కార్యాలయం విశాఖలో నెలకొల్పేందుకు ప్రకటన వెలువడగానే మిగిలిన ఆశలు ఆవిరైపోయాయి. ఈ లోపు పులిమీద పుట్ర లాగా నంద్యాలలో ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రంలోని 50 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీకి కేటాయించడంతో కర్నూలు జిల్లాలో నిరసన ధ్వనులు మొదలయ్యాయి. రాయలసీమలో రైతులు పలు రకాల విత్తనాలను ఉత్పత్తి చేస్తుంటారు. అందుకు అనుగుణంగా కొత్త రకం వంగడాల ఉత్పత్తిలో ఈ వ్యవసాయ క్షేత్రం ప్రధాన భూమిక పోషిస్తున్నది. మెడికల్ కాలేజీకి అవసరమైన ఇతర భూములు ఉన్నా వీటిని కేటాయించడంపై కర్నూలు జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. గమనార్హమైన అంశమేమంటే జిల్లాలోని ప్రజాప్రతినిధులు తామేమీ చేయలేమని చేతులెత్తేశారు.

మరో పరిణామం కూడా రాయలసీమ యువతను ఆందోళనకు గురి చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడైనా పథకం ప్రకారం హత్యలు దాడులు బెదిరింపులు జరిగితే రాజకీయ పార్టీల నేతలు సీమ వాసుల ప్రస్తావన తీసుకు రావడంపై ఇంతకాలం సీమ యువత భగ్గుమనే వారు. తమ ప్రాంతీయులను ఫ్యాక్షన్ కోణంలో చిత్రించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవారు. అది గతించిన చరిత్రగా తేల్చేవారు. ఒక విధంగా అది వాస్తవం కూడా. కానీ, నేడు సీన్ రివర్స్ అయింది. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతకాలం లేని హత్యలు చోటు చేసుకుంటున్నాయి. టిడిపి నేతల హత్యలు, వారిపై దాడులే కాకుండా వైకాపా వర్గాల్లో కూడా ఫ్యాక్షన్ దాడులు పెచ్చుమీరడం సీమ యువతలో ఆందోళన కలిగిస్తోంది.

వైకాపా అధికారంలోకి రాగానే సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం మొదలౌతాయని సీమ వాసులు భావించారు. నేడు అంతా తలకిందులైంది. హంద్రీనీవా విస్తరణ అటకెక్కింది. గాలేరు నగరి రెండవ దశ పథకం నేల మట్టమైంది. అసలు డిపిఆర్‌లో పేర్కొన్న నీటి కేటాయింపులు దారి దోపిడీకి గురయ్యాయి. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత రాయలసీమకు చెందిన కీలకమైన అన్ని ప్రాజెక్టులు (వెలుగొండ ఒకటవ టన్నెల్ తప్ప) నిధులు లేమితో, అంతర్ రాష్ట్ర వివాదాలతో పడకేశాయి. ఎద్దు పుండు కాకికి ముద్దా అన్నట్లు ఈ దశలో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ తాజాగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాసిన లేఖ సీమ వాసులకు గోరు చుట్టుపై రోకటి పోటులాగా తగిలింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ రెండు పథకాల ఆశలపై చన్నీళ్ళు చల్లినట్లయింది. ఇప్పట్లో ఈ పథకానికి మోక్షం లభిస్తుందనే నమ్మకం సన్నగిల్లింది. అంతేకాదు. ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రితం మొదలుపెట్టి నిర్మాణాలు పూర్తయిన సీమ ప్రాజెక్టులను కూడా కొత్త ప్రాజెక్టులుగా కేంద్ర జల్‌శక్తి శాఖ అంచనా వేస్తుంటే రాష్ట్ర జల వనరుల శాఖ ఏం చేస్తున్నదనే ఆగ్రహం సీమ వాసుల్లో వ్యక్తమౌతోంది. ప్రధానంగా కర్నూలు జిల్లాకు చెందిన పలు పథకాలు వివాదంలో చిక్కుకున్నాయి. కేంద్ర మంత్రి లేఖలోని ప్రాజెక్టుల చరిత్ర పరిశీలిస్తే రాష్ట్ర జల వనరుల శాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఒకవేళ తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తినా ఈ పాటికే ఆ ప్రాజెక్టులకు చెందిన వాస్తవ పరిస్థితి రాష్ట్ర జలవనరుల శాఖ ఎందుకు నివేదించలేదు? కేంద్ర జల్‌శక్తి మంత్రి రాసిన లేఖ పరిశీలిస్తే, తెలంగాణ ప్రభుత్వం కసి కొద్ది ఎడాపెడా అభ్యంతరాలు తెలిపిన ప్రాజెక్టుల లిస్టును కేంద్ర జల్‌శక్తి శాఖ యధావిధిగా తీసుకున్నట్లుంది. గత ఏడాది అక్టోబర్ 6న అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. అప్పుడే తెలంగాణ ప్రభుత్వం తన అభ్యంతరాలను బోర్డుకు సమర్పించింది. ఆ దశలోనే ఒక మారు కేంద్రమంత్రి రెండు రాష్ట్రాలు పరస్పరం చేసుకున్న అభ్యంతరాల ప్రాజెక్టుల గురించి ఆయా రాష్ట్రాలకు తెలియజేయడం జరిగింది. కాని ఇప్పటివరకు ఏపీ జల వనరుల శాఖ పాత ప్రాజెక్టుల గురించి బోర్డుకు వివరణ ఇవ్వలేదు. కేవలం పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ పనులకు చెందిన వివరణ మాత్రం ఇచ్చి చేతులు దులుపుకున్నది. అయితే వారు దాన్ని తిరుగు టపాలో పంపారు. ప్రస్తుతం కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి తన లేఖలో మరో ముక్తాయింపు ఇచ్చి రెండు రాష్ట్రాలను ఇరుకున పెట్టేందుకు సిద్ధమయ్యారు. 'ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు చేపట్టినా కేంద్ర జల సంఘం ఆమోదం తెలిపినా ప్రాజెక్టు పరిధి మారితే కొత్తదిగానే పరిగణించాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు.

ఈ షరతు మేరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన, ప్రధానంగా సీమ ప్రాజెక్టులకు అభ్యంతరాలు వర్తించవు. ముచ్చుమర్రి, గుండ్రేవుల, గాజులదిన్నె సంప్లిమెంటేషన్, గురురాఘవేంద్ర, పులికనుమ, సిద్దాపురం, శివ భాష్యం, ఆర్డీయస్ కుడి కాలువ, నాగులదిన్నె వేదవతి రాయలసీమకు చెందిన పథకాలను కొత్త ప్రాజెక్టులుగా కేంద్ర మంత్రి తమ లేఖలో పేర్కొని వీటికి డిపిఆర్ సమర్పించమని కోరారు.

ఇందులో గుండ్రేవుల, వేదవతి ఒకటి రెండు తప్ప మిగిలిన పథకాల వివరాలను పరిశీలించితే ఎవరికైనా ఆశ్చర్యం కలుగక మానదు. ముచ్చుమర్రి లిఫ్టుకు 2007లో పరిపాలన అనుమతి ఇచ్చారు. నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం మార్పులు చేయడం లేదు. తుంగభద్ర దిగువ కాలువకు కేటాయింపులు ఉన్నా పూర్తి స్థాయిలో నీళు రావడం లేదని 18 టియంసిల మాత్రమే వస్తున్నాయని దాని భర్తీకి 1999 మార్చి నెలలో 135 కోట్ల రూపాయల వ్యయంతో తుంగభద్ర నుండి లిఫ్టును గురురాఘవేంద్ర పథకం పేర పరిపాలన అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఇదీ కొత్త ప్రాజెక్టుగా చెబుతూ డిపిఆర్ ఇవ్వమంటున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు హంద్రీనదిపై నిర్మాణానికి 1971లో పరిపాలన అనుమతి ఇస్తే 1987 నిర్మాణం పూర్తయింది. సప్లిమెంటేషన్ పేరు పెట్టి కొత్త పథకంగా డిపిఆర్ సమర్పించమని ప్రస్తుతం కోరారు. అలాగే శివ భాష్యం (వరదరాజులు గుడి లిఫ్ట్) కూడా కొత్త ప్రాజెక్ట్ అని డిపిఆర్ కోరడం వింతల్లో వింత. ఈ ప్రాజెక్టు నల్లమల అటవీ ప్రాంతం నుండి వచ్చే మునిమడుగుల వాగుపై 1985లో నిర్మాణం మొదలుపెట్టారు. 2000లో పూర్తయింది. ఈ వాగు భవనాసి వాగులో కలుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఇరిగేషన్ పథకాల లిస్ట్ తీసుకొని అభ్యంతరాలు పెట్టినా బోర్డు గాని, కేంద్ర జలశక్తి శాఖ గాని అసలే పరిశీలన చేయలేదు. ఇన్నాళ్లుగా ఎపి ప్రభుత్వం కూడా వివరణ ఇవ్వకపోవడం జలవనరుల శాఖ పనితీరుకు దర్పణంగా ఉంది. వాస్తవంలో తొలిరోజుల్లోనే గుండ్రేవుల రిజర్వాయర్ కొత్తదని, ఇంకా డిపిఆర్ తయారు కాలేదని తర్వాత సమర్పిస్తామని బోర్డుకు రాష్ట్ర ఇంజనీరింగ్ చీఫ్ లేఖ రాసినపుడే జలవనరుల శాఖ డొల్లతనం బహిర్గత మైంది. వైకాపా అధికారంలోకి వచ్చి ఎంతోకాలమైనా సీమవాసుల చిరకాల వాంఛితమైన సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు లేకపోవడం మున్ముందు ఏదో జరుగుతుందనే ఆశలను వమ్ము చేస్తోంది. సీమలో ఏర్పడిన అల్పపీడనం త్వరలోనే తుఫాన్ రూపు దాల్చే అవకాశాలు లేకపోలేదు.

## శీతాకాలంలో పెరిగిన విద్యుత్ వాడకం



**ఏలూరు, జనవరి 19, (ప్రజాపాలన) :** శీతాకాలంలోనూ విద్యుత్ వాడకం అనూహ్యంగా పెరుగుతోంది. దీంతో ఇప్పటి నుంచే వేసవి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపీఈపీడీసీఎల్) ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సంస్థ పరిధిలోకి వచ్చే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఒక్క విశాఖ జిల్లాలోనే విద్యుత్ వాడకం ఎక్కువ శాతంలో ఉంటోంది. వేసవి సీజన్ సమీపిస్తుండటంతో ఈ వాడకం మరింతగా పెరగనుందని ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. అందువల్ల వేసవి డిమాండ్‌ను ముందుగానే అంచాన వేస్తున్న సంస్థ యాజమాన్యం దీనికి తగినట్టుగా విద్యుత్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం సంస్థ పరిదిలోకి వచ్చే ఐదు జిల్లాలకు సంబంధించి 56 లక్షలకు పైగానే విద్యుత్ సర్వీసులుండగా వాడకం చూస్తే 40 మిలియన్ యూనిట్లకు పైగానే ఉంటోంది. ఇది కూడా కొన్ని సందర్భాల్లో పెరుగుతోందని సంస్థ వర్గాలు చెబుతున్నాయి. విశాఖ జిల్లాకు సంబంధించి రోజూ 25కు మించి మిలియన్ యూనిట్ల మేర వాడకం ఉంటోంది. ఈ విధంగా గత ఆరేళ్లకాలంలోనే విద్యుత్ వాడకం ప్రతి ఏడాది పెరుగుతూ వస్తుండగా, తొలుత 15నుంచి 20 మిలియన్ యూనిట్ల వరకే ఉండేది

# అందరి చూపు... తిరుపతి వైపు

**తిరుపతి, జనవరి 19, (ప్రజాపాలన) :** తిరుపతి పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. ఇక్కడ నుంచి గత ఏడాది ఎన్నికల్లో విజయం సాధించిన బల్లి దుర్గాప్రసాదరావు హఠాన్మరణం చెందడంతో.. ఆ స్థానానికి త్వరలోనే ఎన్నిక రానుంది. ఇక, ఇప్పటికే టీడీపీ, బీజేపీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. గెలుస్తాయా? లేదా? అనే విషయాన్ని పక్కన పెడితే.. అధికార పార్టీవైసీపీ దూకుడుకు కళ్లెం వేయాలని మాత్రం నిర్ణయించుకున్నాయి. ఈ క్రమం లోనే అందిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నాయి. ఇక, వైసీపీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర తర్వాత రాష్ట్రంలో జరగబోయే తొలి ఎన్నిక ఇదే. దీంతో అన్ని వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ ఇక్కడ విజయం సాధించింది. గత ఎన్నికల్లో 2 లక్షల పైచిలుకు మెజారిటీతో బల్లి దుర్గా ప్రసాదరావు విజయం దక్కించుకున్నారు. కానీ, ఇప్పుడు అంత మెజారిటీ వచ్చే అవకాశం లేదని.. అంటున్నారు పరిశీలకులు. ఎందుకంటే.. పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అప్పటి దుర్గాప్రసాదరావుకు లభించిన ఓట్లను చూస్తే.. ప్రస్తుత పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దీంతో ఈ మెజారిటీ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తగ్గిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి మాత్రమే చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. మిగిలిన నాలుగు నియోజక వర్గాలు.. వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, సర్వేపల్లి నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో పరిస్థితి ఒకింత ఆశాజనకంగానే ఉన్నా.. నెల్లూరులో మాత్రం అంతర్గత కలహాలతో వైసీపీ అట్టుడుకుతోంది. ఈ క్రమంలో అక్కడి ఎమ్మెల్యేలు.. ఎంపీ విజయానికి సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఇక, గత ఏడాది ఎన్నికల్లో ఇక్కడ ఎంపీ అభ్యర్థి సాధించిన ఓట్లు కూడా ఒక్కొక్క చోట ఒక్కో విధంగా ఉన్నాయి. తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి 708 ఓట్ల మెజారిటీ వస్తే.. ఇక్కడ టీడీపీ ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మి 3 వేల 578 ఓట్ల మెజారిటీ సాధించారు.సత్యవేడులో వైసీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి 44 వేలకు పైగా మెజారిటీ వస్తే.. వైసీపీ ఎంపీకి 42 వేల ఆధిక్యతే వచ్చింది. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి 38వేల ఓట్ల మెజారిటీ వస్తే.. ఎంపీకి 32వేల ఓట్ల ఆధిక్యత లభించింది. నెల్లూరు జిల్లా గూడూరులో వరప్రసాద్‌కు 45వేల ఓట్ల మెజారిటీ వస్తే.. ఎంపీకి 46 ఓట్ల ఆధిక్యత వచ్చింది. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్దన్ రెడ్డికి 14వేల మెజారిటీ వస్తే.. ఎంపీకి 15వేల ఆధిక్యత వచ్చింది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్యకు 78వేల ఓట్ల మెజారిటీ వస్తే? ఎంపీకి 57వేల ఆధిక్యవే లభించింది. వెంకటగిరిలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి 88 వేల ఓట్ల మెజారిటీ వస్తే.. ఎంపీకి కేవలం 36 వేల ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక, ఇప్పుడున్న పరిస్థితిలో వెంకటగిరిలో ఆనం రామ నారాయణరెడ్డి ఫుల్లు అసంతృప్తితో ఉన్నారు. సో.. ఆయన ఎంపీ అభ్యర్థి కోసం ప్రయత్నించే అవకాశం తక్కువగా ఉంది. దీంతో ఇక్కడ వైసీపీకి ఓట్లు మరింత తగ్గుతాయని అంటున్నారు. ఆయన ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో తనకు సీటు రాదని డిసైడ్ అయిన పార్టీని, నియోజక వర్గాన్ని పట్టించుకోవడం మానేశా రు. వెంకటగిరిలో ఈ సారి వైసీపీకి దెబ్బ పడే ఛాన్సులే ఉన్నాయి. గూడూరులో గత ఎన్నికల్లో ఎంపీకి 46 వేల ఓట్లు వచ్చినా.. ఇప్పుడు ఇది తగ్గుతుందని చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. సొంత పార్టీలోనే ఆయనపై వ్యతిరేకత వచ్చింది. కొన్ని ప్రధాన వర్గాలు ఈ సారి పార్టీకి పనిచేయడమే మానేశాయి. సో..ఇక్కడ కూడా ఎంపీ అభ్యర్థికి ఓట్లు తగ్గడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు శ్రీకాళహస్తిలో బొజ్జల కుటుంబం పుంజుకుంది. దీంతో ఇక్కడ కూడా వైసీపీ ఎంపీ అభ్యర్థికి మెజారిటీ తగ్గుతుందని అంటున్నారు. ఇలా.. నాలుగు నుంచి ఐదు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే ప్రభావం పడుతుందని అంటున్నారు పరిశీలకులు. దీనిని బట్టి వైసీపీకి ఇక్కడ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవడం అంత ఈజీకాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ గెలిచినా.. గత మెజారిటీ రాదని చెబుతున్నారు. ఏదేమైనా వైసీపీ ఈ సారి లక్ష మెజార్టీతో ఈ సీటు గెలిస్తే గ్రేట్ అనుకోవాల్సిన పరిస్థితే అక్కడ ఉంది.

## ఒంటరైపోయిన రాపాక

**కాకినాడ, జనవరి 19, (ప్రజాపాలన) :** రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పరిస్థితి ఎటూ కాకుండా పోయింది. ఆయనను ఏ పార్టీ కార్యకర్తలు దరిచేరనీయడం లేదు. దీంతో రాపాక వరప్రసాద్ రెంటికి చెడ్డ రేవడిగా మారారు. ఇటు వైసీపీ కార్యకర్తలు ఆయనను తమ నేతగా అంగీకరించడం లేదు. జనసేన క్యాడర్ రాపాకను ఎప్పుడో తమ మనస్సుల్లో నుంచి తీసివేశారు. వచ్చే ఎన్నికల నాటికి రాపాక వరప్రసాద్ పరిస్థితి ఏంటన్నది ఆయనకే అర్థం కాకుండా ఉంది.గత ఎన్నికల్లో రాపాక వరప్రసాద్ రాజోలు నుంచి జనసేన తరుపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనసేన పార్టీ అభ్యర్థులు పవన్ కల్యాణ్ తో సహా అందరూ ఓటమిపాలయినా రాపాక వరప్రసాద్ మాత్రం విజయం సాధించారు. దీంతో జనసేనకు కొంత ఊరల లభించింది. అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. రాపాక వరప్రసాద్ ను జనసేన క్రమంగా దూరం పెట్టడం ప్రారంభించింది. ఇది గమనించి రాపాక వరప్రసాద్ వైసీపీకి దగ్గరయ్యారు.వైసీపీ ప్రభుత్వ వైఖరిని జనసేన ఎండగడుతుంటే రాపాక వరప్రసాద్ మాత్రం పొగుడుతుంటారు. అసెంబ్లీ లో ప్రతి అంశానికి రాపాక మద్దతిస్తున్నా పవన్ కల్యాణ్ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తన తనయుడిని కూడా అధికారికంగా జగన్ సమక్షంలో రాపాక వరప్రసాద్ వైసీపీలో చేర్చారు. అంటే రాపాక వరప్రసాద్ వైసీపీలో ఉన్నట్లే. అయితే వైసీపీ శ్రేణులు మాత్రం దీనికి అంగీకరించడం లేదు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో తాను వైసీపీ కార్యకర్తనేనని చెప్పారునిజానికి రాజోలులో వైసీపీలో రెండు గ్రూపులున్నాయి. రాపాక వరప్రసాద్ వైసీపీకి మద్దతుదారుగా ఉండటంతో మూడు గ్రూపులయ్యాయి. రాపాక వరప్రసాద్ కు వైసీపీ శ్రేణులు సహకరించడం లేదు. గత ఎన్నికల్లో తన వెంట నడిచిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని రాపాక వరప్రసాద్ పై వైసీపీ క్యాడర్ ఆరోపిస్తుంది. ఇక జనసేన క్యాడర్ రాపాక వరప్రసాద్ వైపు ఎటూ చూడటం లేదు. దీంతో రాపాక వరప్రసాద్ ఎటూ గాకుండా పోయారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు జగన్ టిక్కెట్ ఇచ్చినా వైసీపీ లోని రెండు వర్గాలు సహకరిస్తాయన్న నమ్మకం మాత్రం లేదు.

# లైసెన్స్ ఉంటేనే ఎగుమతులు


**ఒంగోలు, జనవరి 19, (ప్రజాపాలన) :** పొగాకు సాగు నుంచి విక్రయం వరకు అంతా ఆన్‌లైన్ విధానమే. ఆధునికత సంతరించుకున్న మోతుబరీ వాణిజ్య పంటగా పేరున్న ఈ సాగులో ఆన్‌లైన్ విధానంలో నిక్షిప్తమవుతోంది. ఎంత మంది రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేసిందీ, ఆయా సాగుపై వచ్చిన దిగుబడి, వేలం కేంద్రంలో పొగాకు వేలం వేసిన తర్వాత కంపెనీలు రైతులకు చెల్లించే ధరలు తదితరాలన్నీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటాయి. ఇంత పారదర్శకంగా కార్యకలాపాలు తేటతెల్లంగా తెలుస్తున్నప్పటికీ అవకతవకలు జరుగుతున్నట్టు పొగాకు బోర్డు గుర్తించి ఈ ఏడాది తాజాగా కఠిన చర్యలు చేపట్టింది. పొగాకు సాగుకు లైసెన్స్ పొందిన రైతుల పేరిట లైసెన్స్ పొందని రైతులు సాగు చేసిన పొగాకును అమ్ముకుంటున్నట్టు పొగాకు బోర్డు గుర్తించింది.పొగాకు బోర్డు చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ పొందిన రైతులు మాత్రమే పొగాకు సాగు చేయాల్సి ఉంది. ఏదైనా కారణం చేత రైతులు పొగాకు సాగు చేయని విషయాన్ని పొగాకు బోర్డుకు ముందుగా తెలియ జేయాల్సి ఉంది. ఈ మేరకు పొగాకు పండించం లేదని రిటర్న్ దాఖలు చేయాల్సింది గా పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ కె చంద్రశేఖర్ తెలియజేశారు. పొగాకు సాగు చేసేందుకు పొగాకు బోర్డు నుంచి లైసెన్స్ తీసుకున్న రైతులు తాను పండించడం లేదని నిబంధనల ప్రకారం ముందుగానే తెలియజేస్తే ఆ మరుసటి ఏడాది సాగుకు అనుమతి లభిస్తుంది, లేదంటే ఆ మరుసటి ఏడాది కూడా సాగుకు అనుమతి దక్కదు. రిజిస్ట్రేషన్ పొందిన కొంతమంది రైతులు పొగాకు రైతులు పొగాకు పండించకుండా పొగాకు పండించినట్టు ఫారం 2, 3 రిటర్న్‌లు దాఖలు చేసి అనధికారికంగా కౌలుకు ఇవ్వడం జరుగుతోందని పొగాకు బోర్డు గుర్తించింది. అంతేకాకుండా కొంత మంది ఇతర రైతులు పండించిన పొగాకును తనపేరు మీద వేలం కేంద్రంలో అమ్మకం, లేదంటే ఒక రైతు కోటాలో మరో రైతు అమ్మడం, అనధికారికంగా పొగాకు పండించిన రైతుల పొగాకును అక్రమంగా



కొనుగోలు చేసి వేలం కేంద్రంలో అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్టు బోర్డు గుర్తించింది. అంతేకాకుండా లైసెన్స్‌లను అడ్డుపెట్టుకుని కమిషన్ వ్యాపారం నిర్వహిస్తున్నారని తదితర ఉదంతాలు పొగాకు బోర్డు దృష్టికి రావడంతో ఈ ఏడాది ముందుగానే కఠినమైన నిర్ణయాలతో సాగును పర్యవేక్షిస్తున్నారు.పొగాకు బోర్డు వేలం నిబంధనల ప్రకారం రైతు తాను పండించని పొగాకును అంటే ఇతర రైతులు పండించిన పొగాకును తన పేరు మీద వేలం కేంద్రంలో అమ్మేందుకు ప్రయత్నించడం నేరం. ఇటువంటి వారి పొగాకు అమ్మకాలను నిలిపి వేయడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేసి చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని రీజనల్ మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పొగాకు బోర్డు అంతిమ లక్ష్యం నిజమైన రైతుల సంక్షేమమేనని, కాబట్టి రిజిస్ట్రేషన్ పొంది పొగాకు పండించని రైతులు నిల్ రిటర్న్‌లు దాఖలు చేయాల్సిందిగా ఆయన సూచించారు. ఇదిలా ఉండగా పొగాకు బ్యారన్లను క్యూరింగ్‌కు ఉపయోగించని రైతులను కూడా పొగాకు పండించని రైతులుగా పరిగణిస్తారు. ఏదైనా కారణం చేత బ్యానర్లను క్యూరింగ్‌కు ఉపయోగించకపోతే ముందే ఆ సంగతి బోర్డు వారికి తెలియజేయాల్సి ఉంది. రైతులు తమ ఉత్పత్తులను నిర్దేశిత వేలం కేంద్రంలో కాకుండా బయట విక్రయాలు సాగించే ప్రయత్నాల పట్ల కూడా పొగాకు బోర్డు తీవ్రంగా పరిగణిస్తుంది. ఇటువంటి ప్రయత్నాల పట్ల పొగాకు బోర్డు అత్యంత కఠినంగా వ్యవహరిస్తుం దని, రైతు సంక్షేమం దృష్ట్యా బోర్డు ఈ విధంగా వ్యవహరించకపోతే పొగాకు రైతు మనుగడే కష్టతరమ య్యే పరిస్థితి ఉంటుందని అధికారు లు పేర్కొంటున్నారు. పొగాకు బోర్డు లైసెన్స్ కలిగి, అనధికార కార్యక లాపాల్లో పాల్గొనే రైతులను బోర్డు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తుందని, పొగాకు బోర్డు ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులచే తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ తెలియజేశారు. పొగాకు బోర్డు ఇచ్చిన లైసెన్స్‌ను అక్రమంగా వినియోగించిన రైతులపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటారని, కాబట్టి పొగాకు రైతులందరూ కష్టపడి పండించిన రైతులకు న్యాయం చేయడానికి సహకరించాల్సిందిగా రీజనల్ మేనేజర్ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

## ఢమాల్.. ఢమాల్.. వాట్సాప్

**న్యూఢిల్లీ, జనవరి 19, (ప్రజాపాలన) :** వాట్సప్ ప్రైవసీ పాలసీ మారుస్తున్నామని చెప్పినప్పటి నుండి వాట్సప్ యాల్ అన్ ఇన్స్టాల్స్ రోజు రోజుకీ పెరుగుతున్నాయి. ప్రైవసీ పాలసీని మారుస్తూ, పేరెం ట్ కంపెనీ అయిన ఫేస్ బుక్ తో వాట్సాప్ డేటాని పంచుకుంటామని తెలియజేయడంతో యూజర్లందరూ వాట్సప్ నుండి వైదొలు గుతున్నారు. దాంతో టెలిగ్రామ్, సిగ్నల్ యాప్‌లకి గిరాకీ బాగా పెరుగుతుంది. రానున్న రోజుల్లో 18శాతం మాత్రమే వాట్సాప్ ని కంటిన్యూ చేస్తారని, 15శాతం మంది పూర్తిగా మానేసారని, పూర్తిగా 36శాతం వాడకం తగ్గిందని లోకల్ సర్కిల్స్ చేసిన సర్వేలో వెల్లడైంది.మొత్తం 8977మందిపై చేసిన ఈ సర్వేలో ఈ విషయాలు




బహిర్గతం అయ్యాయి. 2బిలియన్లకి పైగా వాట్సాప్ యూజర్లున్న ప్రపంచానికి, ఫేస్ బుక్ యాజమాన్యం, వాట్సాప్ ప్రైవసీ పాలసీని మారుస్తున్నామని, కాంటాక్ట్స్ ని ఫేస్ బుక్ తో పంచుకుంటామని ఫిబ్రవరి 8వ తేదీ నుండి అమల్లోకి రానుందని తెలిపింది. ఈ ప్రకటకపై తీవ్ర విమర్శలు రావడంతో వాట్సాప్ వెనక్కి తగ్గి 202మే 15వ తేదీ వరకు అలాంటి ఆలోచన లేదని విరమించుకుంది.ప్రస్తుతం స్టార్ట్ అప్ కంపెనీస్ అన్నీ సిగ్నల్ యాప్ పై ఇన్వెస్ట్ చేయడానికి రెడీ అవుతున్నాయి. ఈ మేరకు వాట్సాప్ యాజమాన్యం, ప్రైవసీ గురించి చెబుతూ, మీకెలాంటి ఇబ్బంది ఉండదని, మీరు చేసిన చాట్స్, మీ ఫ్రెండ్స్ చేసిన చాట్స్ కి భద్రత ఉంటుందని తెలుపుతుంది. మీరు షేర్ చేసిన లోకేషన్ కూడా సురక్షి తంగా ఉంటుందని చెబుతున్న ప్పటికీ, 67శాతం యూజర్లు వాట్సాప్ ని విడిచే పనిలో ఉన్నారు. ముఖ్యంగా వాట్సాప్ బిజినెస్ అకౌంట్లు వాడకూడదని నిర్ణయం తీసు కుంటున్నారు. ట్రాన్సాక్షన్ సహా ఇతర పర్సనల్ డేటా ఫేస్ బుక్ కి వెళ్ళిపోతుందన్న ఉద్దేశ్యంతో వాట్సాప్ వినియోగం తగ్గుతుంది.

## ఎస్ఐ ఆత్మహత్య

**గుడివాడ జనవరి 19, (ప్రజాపాలన) :** కృష్ణాజిల్లా గుడివాడ టూ టౌన్ ఎస్ఐ పిల్లి విజయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారు. తన అపార్ట్ మెంట్ లో విజయ్ కుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. విజయ్ కుమార్ మృతికి వివాహేతర సంబంధమే కారణమంటూ సహచర సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరుకు చెందిన విజయ్ కుమార్, 2012 బ్యాచ్ యసై గా, హనుమాన్ జంక్షన్లో తొలి బాధ్యతలు తీసుకున్నారు. నూజివీడు కు చెందిన బ్యూటీషియన్‌తో వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణలతో విజయ్‌కుమార్ అప్పట్లో సస్పెండ్ అయ్యారు. సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత తిరిగి విధుల్లో చేరిన విజయ్ కుమార్ గుడివాడ సబ్ డివిజన్ పరిధిలోనీ పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సై గా బాధ్యతలు నిర్వహించారు. ఏలూరు చెందిన మహిళతో మూడు నెలల క్రితం విజయ్ కుమార్ కు వివాహం కాగా, భార్యను కాపురానికి తీసుకురాకుండా బ్యూటీషియన్ తో కలిసి ఆయన ఒక అపారట్ మెంట్‌లో ఉంటున్నారు. బ్యూటిషన్ ఒత్తిడి వల్లే విజయ్ కుమార్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విజయ్‌కుమార్ భౌతికకాయాన్ని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రొయ్యల చెరువులుగా పంట పొలాలు

**కాకినాడ, జనవరి 19, (ప్రజాపాలన) :** పచ్చని పంట పొలాలు తెల్లారేసరికి రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. ఏ అనుమతులతో పని లేకుండా ఎవరి ఇష్టానుసారంగా వారు చెరువులు తవ్వుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. పంట పొలాల మధ్య చెరువులు తవ్వడం వల్ల చవుడుబారి పనికిరాకుండా పోతున్నాయని వాపోతూ ఆందోళనకు దిగినా పట్టించుకునే వారే లేరని రైతులు మండిపడుతున్నారు. కొత్తపల్లి మండలం రమణక్కపేట, నాగులాపల్లి గ్రామాల మధ్యలోనెల రోజులుగా పొక్లెయిన్లతో చెరువుల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సంబంధితాధికారులకు భారీగా ముడుపులు ముడుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి కోసం కొత్తపల్లి, తొండంగి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి మండలం తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో వరి పంట పొలాలు సుమారు 2 వేల ఎకరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిపై



ఆధారపడి 4 వేల మంది రైతులు, 10 వేల మంది వ్యవసాయ కూలీలు, పరోక్షంగా మరో 10 వేల మంది వ్యాపారులు, ఇతర వర్గాలు జీవిస్తున్నారు. ఉన్న కొద్ది పంట పొలాలను సాగుచేసుకుని జీవిస్తున్న వీరిపై రొయ్యల చెరువుల తవ్వకాలు తీవ్ర ప్రభావం చూపనున్నాయంటున్నారు. ప్రస్తుతం వందల ఎకరాల పంట పొలాల మధ్యచెరువులు తవ్వడం వల్ల కలుషిత జలాలు విడుదలై చుట్టుపక్కల పొలాలు పనికిరాకుండాపోతాయని రైతులు వాపోతున్నారు. అత్యంత వ్యవసాయాధారమైన ఇక్కడి పంట కాలువ పెదేరులో ఈ కలుషిత జలాలు కలవడంతో అన్ని పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి పంట పొలాలపై కన్నేసిన కాకినాడ రూరల్ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీ నేత ఆ పొలాలను లీజు పేరుతో తన సొంతం చేసుకుని ఆ పార్టీ నేతల అండదండలతో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా రొయ్యల చెరువులు తవ్వకాలు చేపట్టినట్టు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి రొయ్యల చెరువులు తవ్వకూడదనే ఖచ్చితమైన నిబంధన ఉంది. చెరువులు ఒకవేళ తవ్వాల్సి వస్తే రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, పొల్యూషన్, భూగర్భ, మత్స్యశాఖ వంటి 22 శాఖల అనుమతులు తీసుకోవాలి. అయితే ఇక్కడ ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చెరువుల తవ్వకాలు చేపడుతున్నా సంబంధితాధికారులు ప్రేక్షకపాత్ర వహించడం గమనార్హం. 'తమ పొలాల మధ్య అక్రమ చెరువుల తవ్వకాలు జరుగుతున్నాయని, వాటి వల్ల తమ పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని అధికారులకు స్థానిక రైతులు ఫిర్యాదు చేసినా అరణ్య రోదనవుతుందేతప్ప సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఇప్పటికే సుమారు 150 ఎకరాల్లో తవ్వకాల కోసం పచ్చని చెట్లను కూల్చేశారని, పొలాల గట్లను తీసేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే జోక్యంచేసుకొని అక్రమ చెరువుల తవ్వకాలను నిలిపివేసి ... తమ పొలాలకు రక్షణ కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిసింది.

## జగన్‌కు ఈడీ ఉచ్చు తప్పదా?

**విజయవాడ, జనవరి 19 (ప్రజాపాలన) :** మొత్తానికి ప్రత్యర్థుల జోస్యాలు ఇన్నాళ్ళకు ఫలిస్తాయా. జగన్ జైలు అంటూ మంచి రైమింగ్ తో టైమింగుతో తరచూ సెటైర్లు వేసే జగన్ ఆగర్భ శత్రువుల కోరికలు తీరే రోజులు వచ్చేసినట్లేనా. ఈడీ కోర్టు జగన్ విజయసాయిరెడ్డిలను స్వయంగా విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేయడంతో కథ వేగంగా సాగుతోందని అందరికీ అర్ధమవుతోంది. జగన్ ఎంపీ కానపుడు తండ్రి వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఒక పారిశ్రామికవేత్తగా ఉంటూ ఆర్ధిక నేరాలకు పాల్పడ్డారు అన్న దాని మీద ఈడీ కోర్టులోవిచారణ చేస్తోందిఆర్ధిక నేరాల కేసులో జగన్ మీద వచ్చిన అభియోగాలకు సంబంధించి పూర్తి ఆధారాలు ఈడీ సేకరించిందని చెబుతున్నారు. మనీ లాండరింగ్ కేసుల్లో జగన్ తప్పకుండా బుక్ అయి తీరుతారు అని కూడా అంటున్నారు. సీబీఐ కేసులు జగన్‌కి పెద్దగా సమస్య కాకున్నా ఈడీ కేసులు మాత్రం చాలా తీవ్రంగానే జగన్ రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేస్తాయని కూడా ఈ రంగాన నిపుణత సాధించిన వారు అనే మాట. ఇక ఈ విషయం మీద గతంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా చెప్పిన మాట ఒకటి ఉంది. ఈడీ కేసులే జగన్‌కి కొంత ఇబ్బంది అయ్యే అవకాశం ఉందని అప్పట్లో ఉండవల్లి కూడా చెప్పారు. ఆయన స్వతహాగా న్యాయవాది కూడా. జగన్ మీద కేసులు ఇలా విరుచుకుపడితే రక్షించేది ఎవరు, అసలు ఏపీ రాజకీయం ఏ మలుపు తిరుగుతుంది అన్నది కూడా హాట్ హాట్ గా చర్చ సాగుతోంది. జగనే అన్నింటికీ మూల బిందువు. ఆయనే అటు పార్టీ, ఇటు ప్రభుత్వం కూడా. అలాంటిది జగన్ కనుక ఈడీ కేసుల్లో ఇరుక్కుంటే సర్కార్ భవిష్యత్తు ఏంటి అన్నది కూడా వైసీపీలో వాడి వేడి చర్చగా ఉందని అంటున్నారు. అయితే జగన్ ప్రతిపక్షంలో ఉన్నపుడు కానీ ఇపుడు ముఖ్యమంత్రిగా కానీ బీజేపీ పెద్దలతో సన్నిహితంగా ఉంటున్న సంగతి విదితమే. ఏపీలో ఏడాదిన్నర పాలన పూర్తి చేసుకున్న జగన్ కేంద్రాన్ని ఏ విషయంలోనూ గట్టిగా ఇంతవరకూ నిలదీయలేదంటే అది కచ్చితంగా భవిష్యత్తు అవసరాల కోసమే అని ప్రత్యర్థులు ఎపుడూ విమర్శిస్తూ ఉంటారు. మరి ఆ అవసరం జగన్ కి ఇపుడు వచ్చిందా అన్నదే ప్రశ్న. ఏపీలో రాజకీయ పరిణామాలు ఏ మాత్రం తేడా కొట్టినా ఆ స్పేస్ లోకి దూసుకురావడానికి బీజేపీ రెడీగా ఉంటుందన్నది వేరేగా చెప్పాల్సింది లేదు. చంద్రబాబు టీడీపీకి గ్రాఫ్ పెద్దగా పెరగలేదు. ఏపీలో మరే పార్టీకి కూడా అధికారంలోకి వచ్చే చాన్స్ లేదు. బలమైన వైసీపీ ఇబ్బందులో పడితే దాన్ని ఎలా వాడుకోవాలో అలాగే బీజేపీ వాడుకుంటుంది అంటున్నారు. మరి జగన్ ఈ విషయంలో ఏం చేస్తారు, కేంద్రం ఆయనతో సయోధ్యతో ఉంటుందా లేక తెర ముందుకు తానే వస్తుందా అన్నది కూడా చర్చగానే ఉంది. ఏది ఏమైనా ఈడీ కేసుల్లో వేగం పెరగడం వెనక కూడా రాజకీయాలు ఉన్నాయని అంటున్నారు. జగన్ బీజేపీతో శరణామా రణమా ఏ మార్గం ఎంచుకుంటారు అన్న దాని మీదనే ఏపీ రాజకీయాలలో అనూహ్య మార్పులు సంభవిస్తాయి అంటున్నారు.

## మూడేళ్లు కానీ... 30 ఏళ్ల సంగతి తర్వాత

**విజయవాడ, జనవరి 19 (ప్రజాపాలన) :** ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ 30 ఏళ్లు ఉండాలని కోరుకుంటున్నారు. జగన్ టార్గెట్ కూడా అదే. అందుకే సంక్షేమ పథకాలను కుమ్మరించేస్తున్నారు. కానీ మూడు ప్రాంతాల్లో ఆరుగురు నేతలు జగన్ కు ఆ అవకాశం ఇవ్వకపోవచ్చు. ఒక్కసారికే జగన్‌ను ఇంటికి పంపించే ఛాన్స్ కూడా లేకపోలేదు. దీనికి కారణం పెత్తనం. అనేక జిల్లాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న కొందరు నేతల కారణంగా ఈసారి 151 సీట్లు కాదు గదా? అందులో డబుల్ డిజిట్ కు పరిమితమైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. జగన్ ను ముంచుతున్నదీ, ముంచేది ఆ నేతలేనన్న చర్చ పార్టీలోనే జరుగుతుంది. జగన్ కొన్ని జిల్లాలను, ప్రాంతాలను కొందరికి రాసిచ్చినట్లే కనపడుతుంది. అక్కడ వారు చెప్పిందే వేదం. తమ పార్టీ ఎమ్మెల్యేలయినా వారికి అవసరం లేదు. పార్టీ బలోపేతం సంగతి పక్కన పెట్టి సొంత ప్రయోజనాలే చూసుకుంటుండటంతో వైసీపీలో విభేదాలు రచ్చ కెక్కుతున్నాయి. దీంతో వారి పేరు బయటకు చెప్పకపోయినా అధికారులపై వైసీపీ ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిజానికి అధికారులు వారిమాట వినకపోవడానికి జగన్ నియమించిన ఈ ధర్మకర్తలే కారణమని అందరికీ తెలిసిందే. చిత్తూరు జిల్లాను తీసుకుంటే అక్కడ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పింది వేదం. ఆయన మాట శాసనం. ఈ విషయం వైసీపీ ఎమ్మెల్యే రోజా బహిరంగంగా చెప్పకపోయినా అధికారులు తనను పట్టించుకోవడం లేదని విలపించడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. వైసీపీ ఎమ్మెల్యే రోజా లేకుండానే సమావేశాలు, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటే ఎవరి ప్రోద్బలమనేది చెప్పనవసరం లేదు. ఇక నెల్లూరు జిల్లాలో మంత్రి అనిల్ కుమార్ పెత్తనం చేస్తున్నారంటున్నారు. అక్కడ ఆనం రామనారాయణరెడ్డి ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా నెల్లూరు ఎస్పీపై నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఇక ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ, విజయసాయిరెడ్డి, రాయలసీమ ప్రాంతంలో సజ్జల రామకృష్ణారెడ్డిలు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకే విలువ లేకుండా పోతోంది. తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చెప్పి?నట్లే అంతా జరుగుతుంది. ఇలా కొద్ది మంది చేతుల్లోనే అధికార యంత్రాంగం ఉండటంతో వైసీపీ ఎమ్మెల్యేలే పెదవి విరుస్తున్నారు. ఇలా అయితే తాము తిరిగి ఎలా గెలుస్తామని ప్రశ్నిస్తున్నారు. ఇలాగే కొనసాగితే 30 ఏళ్ల సంగతి పక్కన పెడితే మూడేళ్ల తర్వాత మునిగిపోవడం ఖాయమన్న విశ్లేషణలు బలంగా విన్పిస్తున్నాయి.

# కమలం గూటికి గిడ్డి ఈశ్వరి

**విశాఖపట్టణం, జనవరి 19 (ప్రజాపాలన) :** విశాఖ జిల్లా రాజకీయాల్లో బలం పుంజుకోవాలని భావిస్తున్న బీజేపీ ఫిరాయింపు నాయకుల కోసం సెర్చ్ లైట్ పెట్టి మరీ వెతికేస్తోంది. సోము వీర్రాజు ఏపీ ప్రెసిడెంట్ అయ్యాక ఉత్తరాంధ్రా జిల్లాల్లోనే ఎక్కువ టూర్లు వేశారు. ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర అయిదు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేస్తే ఏపీలో పటిష్టమైన శక్తిగా ముందుకు దూసుకు రావచ్చు అని మాస్టర్ ప్లాన్ వేశారు. అయితే అది పెద్దగా వర్కౌట్ కావడంలేదు. అతి రథ మహారథులందరికీ బీజేపీ నుంచి ఆహ్వానం వెళ్ళినప్పటికీ వారు ఇప్పటికీ సైలెంట్ గానే ఉన్నారు. ఇక బీజేపీ మరో కొత్త ప్లాన్ వేస్తోంది. ఏజెన్సీ నుంచే ఎదగాలన్నదే బీజేపీ లేటెస్ట్ అజెండా. జార్ఖండ్ మాదిరిగా ఏపీలో కూడా గిరిజన వర్గాల్లో పట్టు సాధిస్తే బీజేపీకి బలం దానంతట అదే వస్తుందని కూడా ఆలోచనలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో టీడీపీ వైసీపీలలో ఉన్న నేతలకు గేలం వేస్తున్నారు. ఈ గేలానికి విశాఖ జిల్లా పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చిక్కిందని అంటున్నారు. ఆమె వైసీపీలో ఉన్నపుడు ఫైర్ బ్రాండ్ గా ఉండేవారు. జగనన్నకు అచ్చు మైన చెల్లిగా కూడా వ్యవహరించారు. ఎపుడైతే టీడీపీలోకి వెళ్లారో నాటి నుంచి ఆమె ప్రాభవం ఒక్కసారిగా తగ్గిపోయింది. ఇక



టీడీపీలో మంత్రి పదవి ఇస్తామని చెప్పి సైకిల్ ఎక్కించిన పార్టీ పెద్దలు తీరా కండువా కప్పుకున్నాక మాత్రం అలాగే వదిలేశారు. రాజకీయంగా ఏమీ కానీ ఎమ్మెల్యే గా కూడా లేని కిడారి సర్వేశ్వరరావు కుమారుడు శ్రావణ్ కి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా క్యాష్ చేసుకోవాలనుకున్న బాబు గిడ్డి ఈశ్వరిని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇక 2019 ఎన్నికల్లో టికెట్ మాత్రం ఇచ్చారు. జగన్ వేవ్ లో ఆమె ఓటమి పాలు అయ్యారు. నాటి నుంచి చంద్రబాబు సహా పార్టీ పెద్దలు ఆమె గురించి వాకబు చేయలేదు అంటున్నారు. పార్టీ పదవులు అందరికీ పంచినా కూడా గిడ్డి ఈశ్వరికి ఉత్త చేయే చూపించారు. దీంతో రగిలిపోతున్న గిడ్డి ఈశ్వరి వైసీపీలోకి తిరిగి వచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఇక జగన్ అయితే గిడ్డి ఈశ్వరిని పార్టీలోకి తీసుకోవడానికి నో చెప్పేసి డోర్స్ క్లోజ్ చేసేశారు. ఈ పరిణామాలతో ఎటూ తోచకుండా ఉన్న ఆమెను బీజేపీ వైపు నడిపించడంతో కమలం పార్టీ పెద్దలు సక్సెస్ అయ్యారని అంటున్నారు. గిడ్డి ఈశ్వరికి కూడా ఇపుడున్న పరిస్థితుల్లో ఇంతకు మించిన ఆఫర్ వేరేది లేదు అని కూడా అంటున్నారు. మొత్తానికి గిడ్డి ఈశ్వరి బీజేపీకి చేరడం అన్నది ఖాయమైపోయిందని అంటున్నారు. ఆమె బీజేపీలో చేరితే పార్టీ ఏజెన్సీలో ఎంతో కొంత బతుకుతుదని బీజేపీ నేతలు ఆశిస్తున్నారు. నోరున్న నేత కావడమే కాదు, వైసీపీ, టీడీపీలో పనిచేయడం వల్ల నరుగా ఆ పార్టీ అధినాయకత్వాల మీద దూకుడుగా బాణాలు వేయగలదు అని కూడా కమలం పార్టీ వ్యూహ కర్తలు భావిస్తున్నారు. మొత్తానికి గిడ్డి ఈశ్వరికి కమల తీర్ధం ఇప్పించడమే తరువాయి అంటున్నారు.

**ఇక ముద్రగడ..కమల అడుగులు**

బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో గట్టిగా పాగా వేసేందుకు వేగంగా పావులు కదుపులతుంది. కులాల లెక్కలే ఆధారంగా ఆ పార్టీ అడుగులు ముందుకు పడుతున్నాయి. కోస్తా లో బలమైన కాపు సామాజిక వర్గం తమవైపు అండగా వస్తే మిగిలిన వర్గాల ఓట్లతో ప్రధాన పక్షానికి ఎదగాలన్న ఎత్తుగడతో కమలం స్కెచ్ గీస్తుంది. అందులో భాగంగానే కలిసి వచ్చిన జనసేనను చెయ్యి పట్టుకు నడిపిస్తూ పొరపాటున సేన తోక జాడిస్తే ఆ సామాజికవర్గం ఓటర్లు తమనుంచి దూరం కాకుండా ఉండేందుకు కాపు రిజర్వేషన్ల ఉద్యమ నేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వంటి వారికి వల విసురుతుంది. చాలా కాలం క్రితమే సోషల్ మీడియా లో తనపై వస్తున్న విమర్శలు ఆరోపణలకు మనస్థాపం తో కాపు రిజర్వేషన్ల ఉద్యమానికి ముద్రగడ పద్మనాభం రాం రాం చెప్పేశారు. ఆయన అలా తప్పుకోవడానికి బలమైన కారణం బిజెపి లో చేరేందుకా అన్న సందేహాలు ఇప్పుడు విశ్లేషకుల్లో వస్తున్నాయి. సుదీర్ఘ ఆలోచనతోనే ఆయన కాపు రిజర్వేషన్ల అంశానికి తాను దూరం గా ఉంటున్నట్లు ప్రకటించారని ఇప్పుడు పలువురు భావిస్తున్నారు. ముద్రగడ పద్మనాభం వద్దన్నా కాపు రిజర్వేషన్ల పోరాటానికి ఎప్పటినుంచో ఐకాన్ గా మారిపోయారు. దాంతో బిజెపి ఏంటో కాలంగా ముద్రగడకు గాలం వేసేందుకు వ్యూహాత్మకంగా ముందుకు వెళుతుంది. తాజాగా బిజెపి ఎపి అధ్యక్షుడు సోము వీర్రాజు ముద్రగడ పద్మనాభంతో భేటీ సానుకూలంగా జరగడాన్ని బట్టి త్వరలోనే కోస్తా కాపు ప్రముఖుడు కాషాయం కండువా కప్పేసుకుంటారనే అంతా భావిస్తున్నారు. ముద్రగడ పద్మనాభం సీనియర్ రాజకీయ నేత. మంత్రిగా పనిచేసిన అనుభవశాలి. ఆయనకు తగిన రీతిలో ఆఫర్ లేనిదే బిజెపి కండువా కప్పుకునేందుకు ముందుకు రారారని రాజకీయ విశ్లేషకుల అంచనా. అయితే తాజాగా బిజెపికి ఆయనకు మధ్య నడిచిన చర్చల్లో ముద్రగడ పద్మనాభంను రాజ్యసభకు పంపేందుకు పార్టీ ఆలోచన చేసి ఉంటుందని భావిస్తున్నారు. కానీ కోస్తా లో బలమైన నెట్ వర్క్ ఉన్న ముద్రగడ పద్మనాభం వచ్చే ఎన్నికల్లో తన అనుచర వర్గానికి కొన్ని టిక్కెట్లు కోరే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ రెండిటిలో ఏదో ఒక రహస్య ఒప్పందం కుదిరి ఉంటుందన్న చర్చ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో సాగుతుంది. అయితే వీటిలో ఏది నిజం అన్నది ముద్రగడ పద్మనాభం నిర్ణయం తీసుకునే వరకు వేచి చుడాల్సిఉంది.

## నిమ్మగడ్డ స్థానంలో నీలం సాహ్నీ...?

**విజయవాడ, జనవరి 19 (ప్రజాపాలన) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎవరు అంటే ఇపుడు అంతా ఇట్టే చెప్పేస్తారు. గూగుల్ సెర్చ్ చేయాల్సిన అవసరం అంతకంటే లేదు. అంతలా నిమ్మగడ్డ రమేష్ కుమార్ పేరు గడించారు, చాలా బాగా పాపులర్ కూడా అయ్యారు. 151 సీట్లతో కడు బలంగా కనిపించిన జగన్ సర్కార్ తో పోరాడడం ఎలా అన్నది తెలియక అసెంబ్లీలో నానా ఇబ్బందులు పడుతున్నారు రాజకీయ దిగ్గజం చంద్రబాబు. కానీ ఏ రాజకీయ అనుభవం లేకపోయినా కూడా జగన్ ప్రభుత్వాన్ని మూడు చెరువుల నీరు తాగించేస్తున్నారు నిమ్మగడ్డ రమేష్ కుమార్. అతి కొద్ది నెలలు మాత్రమే పదవీ కాలం ఉన్నా కూడా నిమ్మగడ్డ వారి దూకుడు ఎక్కడా తగ్గడంలేదు. మొత్తానికి జగన్ కి తొలి ఏడాదిలోనే నిమ్మగడ్డ మాస్టార్ మంచి పాఠాలే నేర్పారు అని అంటున్నారు. నిజనికి ఎన్నికల సంఘం ప్రధానాధికారి పదవి విషయంలో ఇప్పటిదాకా ఎవరూ పెద్దగా ఆలోచించినది లేదు. రాజ్యాంగ బద్ధమైన ఆ పదవి విషయంలో చంద్రబాబు కూడా పెద్దగా కసరత్తు చేసి నిమ్మగడ్డ రమేష్ కుమార్ ని నియమించారని అనుకోవడానికి లేదు. కానీ గత ఏడాది అనుభవాలు చూస్తే ఆ పదవి ఎంతటి పవర్ ఫుల్ అన్న సంగతి అనుభవ పూర్వకంగా





జగన్ కి తెలిసింది. దాంతో కొత్త అధికారిని ఈసారి చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటారని అంటున్నారు. ఈ మధ్యనే ప్రభుత్వం ప్రధాన కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన నీలం సాహ్నీ కి ఈ అత్యంత కీలకమైన పదవిని కట్టబెట్టడానికి జగన్ సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. ఆమెను సీఎస్‌గా ఏరి కోరి తెచ్చుకున్న జగన్ ఆమె పదవీ కాలాన్ని ఎక్స్ టెన్షన్ కూడా కొన్ని సార్లు చేయించారు. ఇపుడు ఆమె సీఎంకి ముఖ్య సలహాదారుగా నియమితులయ్యారు. అయితే అది టెంపరరీ సర్దుబాటు మాత్రమేనని అంటున్నారు. అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్థానంలో ఆమె కొత్త ఎస్ఈసీగా వస్తారని అంటున్నారు. ఆమె జగన్ సర్కార్‌కి సీఎస్ గా అన్ని విధాలుగా సహకరించారన్నది ఇక్కడ ప్రస్తావనార్హం. ఇక ఎన్నికల సంఘం అధికారాలుచ నిమ్మగడ్డ రమేష్ కుమార్ వ్యవహారశైలి ఏంటో కళ్లారా చూసిన జగన్ ఇకపైన అన్ని విధాలుగా జాగ్రత్తగా ఉంటారని అంటున్నారు. ఎవరిని ఈ పదవిలో కూర్చోబెట్టినా కూడా తనకు అనుకూలంగా ఉన్న వారినే చూసుకుంటారని కూడా చెబుతున్నారు. అదే విధంగా ఎన్నో కీలకమైన పదవులు నామినేట్ చేయాల్సిన వేళ కూడా జగన్ ఇప్పటిదాకా పెద్దగా పట్టించుకున్నది లేదు. కానీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అనుభవంతో ప్రతీ నామినేటెడ్ పదవి విషయంలోనూ కడు జాగ్రత్తలు తప్పక తీసుకుంటారని అంటున్నారు. మొత్తానికి వేస్తే వేప కొమ్మ, తీస్తే అమ్మ వారు లాగా కొన్ని కీలకమైన పదవులు ఉంటాయి. వాటి విషయంలో ఎంతటి జాగరూకతతో వ్యవహరించాలో ఏపీలో కొత్త ప్రభుత్వానికి దాని సారధికి ఇపుడిపుడే అర్ధమవు తోందిట.

## 27న వచ్చేస్తున్న చిన్నమ్మ



**చెన్నై, జనవరి 19 (ప్రజాపాలన) :** తమిళనాడులో ఎన్నికల హడావిడి ప్రారంభమయింది. అన్ని పార్టీలూ ఎన్నికలకు రెడీ అయిపోయాయి. అయితే దినకరన్ కు చెందిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం పార్టీలో మాత్రం ఏ హడావిడి కన్పించడం లేదు. ఇప్పటికే అన్నాడీఎంకే, డీఎంకే, కమల్ హాసన్ మక్కల్ నీది మయ్యమ్ పార్టీలు ప్రచారాన్ని ప్రారంభించాయి. విజయ్‌కాంత్‌కు చెందిన డీఎండీకే కూడా ప్రచారాన్ని ప్రారంభించక పోయినా కార్యకర్తల సమావేశాలను ఏర్పాటు చేసుకుంటుంది. కానీ దినక రన్ మాత్రం శశికళ రాకకోసం ఎదురు చూస్తున్నారు. శశికళ ఈ నెల 27వ తేదీ విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లను శశికళ తరుపున న్యాయవాదులు చేస్తున్నారు. న్యాయస్థానం విధించిన జరిమానా కూడా చెల్లించడంతో శశికళ విడుదల ఈ నెల 27వ తేదీ న ఉంటుందని ఆమె తరుపున న్యాయవాదులు చెబుతున్నారు. శశికళ వచ్చిన తర్వాతనే పార్టీ రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. శశికళ రాకతోనే ప్రచారం ప్రారంభించాలని దినకరన్ నిర్ణయించారు. శశికళకు భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దుల నుంచే శశికళకు స్వాగతం పలకాలని నిర్ణయించారు. సరిహద్దుల నుంచే శశికళ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. శశికళ వచ్చే మార్గంలో ఉన్న ప్రతి గ్రామంలోనూ స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే తమ పార్టీ ప్రచారానికి నాంది అని దినకరన్ చెబుతున్నారు. శశికళ వచ్చిన తర్వాత రాజకీయ వ్యూహాలను నిర్ణయిస్తామని దినకరన్ చెబుతున్నారు. కొంతమంది అన్నాడీఎంకే, డీఎంకే నేతలు తమ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆమె వచ్చిన వెంటనే పార్టీలో చేరతారని దినకరన్ వర్గం చెబుతోంది. చేరికల ద్వారా పార్టీకి ఊపు తెద్దామన్నది దినకరన్ వ్యూహంగా ఉంది. సొంతంగా 234 స్థానాల్లో పోటీ చేయాలా? కూటమితో బరిలోకి దిగాలా? అన్నది శశికళ నిర్ణయించ నున్నారు. మొత్తం మీద శశికళ రాకకోసం దినకరన్ పార్టీ నేతలు ఎదురు చూస్తున్నారు.

# 50వ రోజుకు రైతుల నిరసనలు

**న్యూఢిల్లీ,జనవరి19 (ప్రజాపాలన) :** సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన ఆందోళనకు 50 రోజులు పూర్తయ్యాయి. ఆందోళనలో భాగంగా గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టాలని రైతులు నిర్ణయించారు. అయితే, ఈ ర్యాలీకి అనుమతి ఇవ్వరాదంటూ ఢిల్లీ పోలీసులను ఆదేశించాలని కోరుతూ కేంద్రం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేకంగా శాంతి భద్రతల నిర్వహణ అనేది ఢిల్లీ పోలీసుల పరిధిలోదని, ట్రాక్టర్ల ర్యాలీ వల్ల తలెత్తే పరిస్థితులను పరిష్కరించే అధికారం రాజ్యాంగ న్యాయస్థానానికి లేదని కేంద్రానికి స్పష్టం చేసింది.

ఢిల్లీలోకి ప్రవేశించ డం అనేది శాంతి భద్రతల అం శం.. ఇది పోలీసుల పరిధిలోకి వస్తుంది అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎల్ నాగే శ్వరరావు, జస్టిస్ వినీత్ సారన్‌ల ధర్మాసనం పేర్కొంది..

జనవరి 26న ట్రాక్టర్ మార్చ్‌తో రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిరోధించే న్యాయ పరమైన ఉత్తర్వులను పొందాలనే కేంద్రం ఆసక్తి స్పష్టంగా ఉంది.. ఎందుకంటే పోలీసులు బలప్రయోగం చేయాల్సి వస్తే రాజకీయంగా ఇబ్బంది ఎదురవుతుంది. రైతుల ఆందోళనకు కోర్టు బాధ్యత వహించనందున క్షేత్రస్థాయి పరిస్థితి గురించి సుప్రీంకోర్టు తెలియజేయడం సముచితమని కేంద్రం, ఢిల్లీ పోలీసులు భావించారని అటార్నీ జనరల్ కె కె వేణుగోపాల్ తెలిపారు. అయితే, ఈ అంశంపై జోక్యం చేసుకునేటప్పుడు నిబంధనలను ఆలోచించడం పొరపాటు అని ధర్మాసనం స్పష్టం చేసింది. 'మేము ఒక సమస్యపై విచారణ జరుపుతున్నాం.. (మూడు వ్యవసాయ చట్టాల చట్టబద్ధత).. కోర్టు జోక్యం పూర్తిగా తప్పుడు అర్ధం అవుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. గణతంత్ర దినోత్సవం రోజున వేలాది మంది రైతులు ఢిల్లీలోకి ప్రవేశించి, ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించడం చట్ట విరుద్ధమని, ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని అటార్నీ జనరల్ కే వేణుగోపాల్ అన్నారు. రిపబ్లిక్ డే వంటి రాజ్యాంగ విధులకు తప్పకుండా గౌరవంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కోర్టుకు ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. ట్రాక్టర్లతో రైతులను ఢిల్లీలోకి రాకుండా నిరోధించాలని కోరుతూ రాజధాని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన చీఫ్ జస్టిస్ ఎస్ఏ బాబ్డే ధర్మాసనం.. 'ఢిల్లీలో ట్రాక్టర్ల ర్యాలీ ప్రవేశానికి రాజ్యాంగ న్యాయస్థానంగా మేము తొలుత అనుమతి ఇవ్వడం లేదా నిరాకరించడం కుదరదు.. వారికి అనుమతించే అంశం పోలీసుల పరిధిలోది.. ఎంత మంది హాజరవుతారు.. షరతులు ఏంటి అనేది వారే నిర్ణయించాలి' వ్యాఖ్యానించింది. ఈ సమస్యలన్నీ నిర్ణయించే అధికారం పోలీసులకే ఉన్నాయని కేంద్రానికి సుప్రీంకోర్టు చెప్పాల్సిన అవసరం ఉందా? జనవరి 12 న మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాల అమలును సర్వోన్నత న్యాయస్థానం నిలిపివేసింది.. రైతులలో వ్యతిరేకించే అంశాలను పరిశీలించడానికి నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది.

# సిగరెట్‌తో ప్రాణాలకే చేటు

ధూమపానం ప్రాణాలకు చేటుగా మారుతోంది. టెన్షన్ తట్టుకోలేక కొందరు...రిలాక్స్ కోసం మరికొందరు పొగతాగుతున్నారు. పొగరాయుళ్లకే కాదు...వారికి సమీపంలో ఉండే వాళ్లకూ ప్రమాదకరంగా మారుతోంది. ఒక సిగరెట్‌తోనే ప్రాణం పోతుందా? అంటూ అనేక మంది వాటికి అలవాటు పడి కేన్సర్ ముప్పున పడుతున్నారు. సాధారణంగా 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతలో పొగతాగేవాళ్లు ఎక్కువగా ఉంటున్నారని వైద్యులు తెలిపారు. పొగరాయుళ్లలో 32 శాతం మంది ఈ వయస్సు వాళ్లేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ధూమపానం వల్ల 32 నుంచి 40 సంవత్సరాలలోపు వాళ్లలో 30 శాతం మంది కేన్సర్‌బారిన పడుతున్నారు. రిలాక్స్ కోసం 34 శాతం మంది టెన్షన్ తట్టుకోలేక 35 శాతం మంది, స్టైల్ కోసం 10 శాతం మంది సిగరెట్ తాగుతున్నట్లు వైద్యులు వివరించారు. వందమంది యువతుల్లో 10 శాతం మంది రెగ్యులర్‌గా సిగరెట్ తాగుతున్నారని, అందులో 21 శాతం మంది అప్పుడప్పుడు స్మోకింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధూమపానం వల్ల గొంతు, జీర్ణాశయం, పెదవులు, నాలుక, నోరు, స్వరపేటిక, కిడ్నీ, మూత్రాశయం కేన్సర్ల బారిన పడే వాళ్ల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో తాగితే శిక్ష

బహిరంగంగా ధూమపానం చేసిన వారికి రూ.100 నుంచి రూ.200 దాకా జరిమానా విధించొచ్చు. సిగరెట్ తాగాలని ప్రచారంచేస్తే తొలివిడతగా రూ.1000 జరిమానా, రెండేళ్లజైలుశిక్ష, రెండోసారి తప్పు చేస్తే ఐదేళ్లవరకు జైలుశిక్ష, 5వేల జరిమానా విధిస్తారు. పొగాకు ఉత్పత్తులను హెచ్చరికలులేకుండా విక్రయిస్తే ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమానా. విద్యాసంస్థలకు 100 మీటర్ల లోపు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధం.

నిషేధమా...నివేక్కడా....

బహిరంగ ప్రదేశాలు, కొన్ని ముఖ్యమైన కార్యాలయాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. ధూమపానాన్ని నిషేధిస్తూ చట్టం కూడా అమల్లో ఉంది. కానీ అది ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. తొమ్మిదేళ్ల నుంచి ధూమపానం నిషేధ చట్టం అమల్లో ఉన్నప్పటికీ పెద్దగా పట్టించుకోవడం లేదు.

సిగరెట్ తాగితే....!!

ఒక సిగరెట్ తాగితే 4200 విషవాయువులు శరీరంలోకి వెళ్తాయి.

15 శాతంసిగరెట్లు, 45శాతం బీడీ లు, 30 శాతం సిగార్లు తాగుతున్నారు.

పొగతాగడం మానుకుంటామని కౌన్సెలింగ్‌కు వస్తున్న వారు 35 సంవత్సరాలు దాటిన వారే ఉంటున్నారు.

పొగతాగేవారిలో గుండె సమస్యలు అధికంగా ఉంటున్నాయి.

పొగబారిన పడుతున్నవారిలో మహిళలు, పిల్లలు కూడా ఉంటున్నారు.

ప్రపంచంలో పొగ తాగటం వల్ల ప్రతి ఎనిమిది సెకన్లకూ ఒకరు చనిపోతున్నారు.

పొగతాగడం వల్ల పక్కన వారికీ ప్రమాదమే.

గర్భిణులు ధూమపానం చేయడం వల్ల పుట్టబోయే బిడ్డలకు ప్రమాదమే.

ఛాతివైద్యం కోసం వచ్చి మృతి చెందుతున్న వారిలో 50 శాతం మంది పొగ తాగేవారే ఉంటున్నారు.

ఇలా చేస్తే...

సిగరెట్ మానేయాలనుకుంటే ఈరోజే ఆ పని మొదలు పెట్టాలి

సిగరెట్ తాగాలనిపించినప్పుడు చూయింగ్‌గమ్, చాక్లెట్స్ వాడాలి.

సిగరెట్ ఆలోచన వచ్చినప్పుడు ఆ ధ్యాసను మరో వైపు మార్చాలి.

సిగరెట్‌పై ధ్యాస పోకుండా ధ్యానం, యోగా లాంటివి చేయాలి.

పొగ తాగడాన్ని తగ్గించుకోలేక పోతే ఫార్మాకో థెరపీ తీసుకోవాలి.



## ఆర్థరైటిస్‌కు దీటైన వైద్యం



శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో జీవక్రియల మార్పుల వలన, జన్యుపరమైన మార్పుల వలన వచ్చు కీళ్లజబ్బులలో రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఒకటి. ప్రపంచంలో 0.5 నుంచి 1 శాతం వరకు ఈ జబ్బుతో బాధపడుతున్నారు. 15 ఏళ్లలోపు వయస్సు గల వారిలో ఈ జబ్బు రావడం చాలా అరుదు. 20 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు వారిలో వచ్చే అవకాశం చాలా ఎక్కువ. పురుషుల్లో కన్నా స్త్రీలలో మూడింతలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది.

కారణాలు

శరీరంలోని జీవక్రియల అసమతుల్యత వల్ల, రోగనిరోధక వ్యవస్థలోని మార్పుల వల్ల జబ్బు వస్తుంది. దీనితో పాటు శారీరక, మానసిక ఒత్తిడి కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. మానసిక ఒత్తిడి వల్ల జన్యుపరమైన మార్పులు సంభవించి ఈ జబ్బు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఎవరైతే సరైన ఆరోగ్య పద్ధతులు పాటించని వారు, దూమపానం, మద్యపానం తీసుకునే వారిలో ఈ జబ్బు వచ్చే అవకాశం ఉంటుంది.

లక్షణాలు

ఈ కీళ్ల జబ్బు వల్ల కీళ్లలో సైనోవియల్ మెంబ్రేన్ దెబ్బతింటుంది. కీళ్లలో అనవసరమైన ఫైబ్రస్ టిష్యూ పేరుకుపోతుంది. దానిని ప్యానస్ అంటారు. ఈ ప్యానస్ అనే చెడు పదార్థం వల్ల కీళ్లలో కార్టిలేజ్ దెబ్బతింటుంది. కీళ్లలో వాపులు తరచుగా వస్తూపోతూ ఉంటాయి. ఈ జబ్బులో లక్షణాలు కొన్నిసార్లు అధికం కావడం, తాత్కాలికంగా ఉపశమనం లభించడం జరుగుతుంది. లక్షణాలు అధికమైనపుడు జ్వరం, కీళ్లలో వాపులు, కీళ్లు ఎరుపెక్కడం, కీళ్లు బిగుసుకుపోవడం, తీవ్రమైన నొప్పి, కదలికలు తగ్గిపోవడం, ఆకలి తగ్గిపోవడం జరుగుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో చేతి మణికట్టు కీళ్లు, చేతి వేళ్లు, మోచేతి కీళ్లు, మోకాళ్లు ఎక్కువగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఈ ఆర్థరైటిస్‌లో కేవలం కీళ్లు దెబ్బతినడమే కాకుండా శరీరంలో ఇతర అవయవాలు కూడా దెబ్బతింటాయి. ఊపిరితిత్తులలోని పైపొర, గుండె పైపరో, దెబ్బతినే అవకాశం ఉంటుంది. తద్వారా గుండెనొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. తరచుగా ఊపిరి తిత్తుల్లో ఇన్‌ఫ్లమేషన్ కారణంగా తుమ్ములు రావడం, దగ్గురావడం జరుగుతుంది. రక్త కణాల సంఖ్య పడిపోయి ఎనీమియాకు కారణమవుతుంది. ప్లీహం వాపుకు గురవు తుంది. కళ్లు, నోరు పొడిబారిపోవడాన్ని జోగ్రెన్ సిండ్రోమ్ అంటారు. చర్మం కింది భాగంలో గుళికల్లాంటి ఆకారాలు ఏర్పడతాయి. వీటిని రుమటాయిడ్ నొడ్యుల్స్ అంటారు.

వ్యాధి నిర్ధారణ

రక్తంలోని యాంటీబాడీస్ కనుగొనే పరీక్ష రుమటాయిడ్ ఫ్యాక్టర్(ఆర్ఏ) పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. అలాగే యాంటీ సీసీపీ, యాంటీ సిట్రులినేటెడ్, పెప్టైడ్ పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. కీళ్లను ఎక్స్‌రే తీయించి ఎముకలలో ఎరోషన్స్ గుర్తించి నిర్ధారించవచ్చు. సాధారణ పరీక్షలు సీబీపీ, ఈఎస్ఆర్, సీఆర్‌పీ పరీక్షలు కూడా వ్యాధి నిర్ధారించడంలో సహాయపడతాయి.

జాగ్రత్తలు

కీళ్లజబ్బులు బారినపడకుండా ప్రతిరోజు వ్యాయామం చేయాలి. సరియ్యైన పోషకాహారం తీసుకోవాలి. ఎలాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతిరోజు యోగా, ధ్యానం చేయాలి.

హెూమియో వైద్యం

రోగి మానసిక, శారీరక లక్షణాలను అనుసరించి హెూమియో వైద్యం ఇవ్వడం జరుగుతుంది. లెడంపాల్, బ్రయోనియా, రస్టాక్స్, కాల్చికమ్, బెంజోయిక్ ఆసిడ్, కాలిమూర్, పల్సటిల్లా తదితర మందులు ఉపకరిస్తాయి.

## క్షయను వేగంగా గుర్తించే రక్తపరీక్ష

ఏటా వేలాది ప్రాణాలను హరిస్తున్న క్షయ వ్యాధిని వేగంగా నిర్ధారించే సరికొత్త రక్తపరీక్షను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వ్యాధి నిర్ధారణతో పాటు, వ్యాధి తీవ్రతనూ ఈ పరీక్షతో తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరీక్షలతో టీబీ నిర్ధారణకు రోజులు, వారాల తరబడి సమయం పడుతోందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు కోటి మంది టీబీ బారిన పడుతుండగా, 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తాజా రక్తపరీక్ష ద్వారా టీబీని గంటల వ్యవధిలో గుర్తించి, వ్యాధి విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చని అరిజోనా యూనివర్సిటీ పరిశోధకుడు టోనీ హూ పేర్కొన్నారు.



# లిప్‌స్టిక్...హెల్త్‌కు ట్రబుల్



అమ్మాయిలకు పెదవులపై లిప్‌స్టిక్ పూయనిదే మనస్సు ప్రశాంతంగా ఉండదు. హ్యాండ్ బ్యాగ్‌లో లిప్‌స్టిక్ బాటిల్ లేనిదే బయట అడుగు పెట్టరు. యువతులు, పిల్లలు ఇలా అన్ని వయస్సుల వారు లిప్‌స్టిక్‌పై యమ ఆసక్తి చూపుతున్నారు. కొన్ని రకాల లిప్‌స్టిక్‌ను ఎడాపెడా పెదవులపై రుద్దేస్తుండడంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ప్రస్తుతానికి లిప్‌స్టిక్ అందం కోసం పెట్టుకున్నప్పటికీ రాను రానూ తీవ్ర అనారోగ్యానికి దారి తీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. లిప్‌స్టిక్‌ను ఎక్కువ సార్లువినియోగించిన వారు పలు అనారోగ్య సమస్యలతో వైద్యులను ఆశ్రయిస్తున్నారు. చాలా మంది అమ్మాయిలు లిప్‌స్టిక్‌ను తమకు తెలియకుండానే మింగేస్తున్నారు. లిప్‌స్టిక్‌ను పెదవులపై రుద్దినప్పుడల్లా.. అది కడుపులోకి పోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోజుకు 12 నుంచి 15 సార్లు పూసే అమ్మాయిల్లో 8.7 మిల్లిగ్రామ్‌ల లిప్‌స్టిక్‌ను మింగేస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. పెదవులు ఎండినట్లు అనిపించిన ప్రతిసారీ నాలుకతో తడుపుకోవడం సర్వసాధారణం. అప్పుడు పెదవులకున్న లిప్‌స్టిక్ వాళ్లకు తెలియకుండానే కడుపులోకి పోతుందని వైద్యులు వివరించారు. అలాగే కాఫీ, టీ, జ్యూస్, నీళ్లు తాగినప్పుడు లిప్‌స్టిక్‌ను మింగేస్తున్నారని, అలాగే లిప్‌స్టిక్‌ను పూర్తిగా తొలగించకుండా భోజనం చేస్తున్నారని, దీం తో చాలా ఎక్కువగా లిప్‌స్టిక్ కడుపులోకి చేరుతుంద ని డాక్టర్లు పేర్కొంటున్నారు. లిప్‌స్టిక్‌లో సీసం ఉండడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు తెలిపారు. కొంత మంది తమ డ్రెస్‌ను బట్టి రకరకాల లిప్‌స్టిక్ కలర్స్‌ను వాడుతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై మ రింత ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

నెలకు రెండు, మూడు కేసులు...

లిప్‌స్టిక్‌ను ఎడాపెడా వాడేవారు.. అది పూయనిదే బయటికి వెళ్లలేని వారు.. అప్పటికి అందంగా కనిపించాలని అనుకుని లిప్‌స్టిక్ వాడేవారు కూడా అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఇలా అనారోగ్య సమస్యలతో నెలకు ఇద్దరు, ముగ్గురు తమ ను సంప్రదిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువ మంది జీర్ణకోశ వ్యా? ధులకు సంబంధించిన సమస్యలతో వస్తున్నారని డాక్టర్లు చెబుతున్నారు. పరీక్షలు చేసే ముందు వారు వినియోగించే ఆహార పదార్థాలు, ఇతర వస్తువులపై ఆరా తీయడంతో అస లు విషయం బయట పడుతోందని డాక్టర్లు పేర్కొంటున్నారు. దీనివల్ల భవిష్యతలో తీవ్ర అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ముప్పు ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ముమ్మందు ముప్పే....

లిప్‌స్టిక్‌వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయి. కొన్ని రకాల లిప్‌స్టిక్‌ల్లో 10 పీపీఎం సీసం ఉంటోంది. ఇంతస్థాయిలో సీసం ఉంటే ప్రమాదకరం. 0.1 పీపీఎం వరకు సీసం ఉంటే పర్వాలేదు. కానీ ఎక్కువ స్థాయిలో ఉంటే చాలా ముప్పు. లిప్‌స్టిక్‌లో సీసం పెరిగిందని ఎఫ్‌డీఏ హెచ్చరించింది. లిప్‌స్టిక్ ఎక్కువగా వాడడం వల్ల నరాలకు సంబంధించిన జబ్బులు, మూత్రపిండాలు, ఎముకలు, కేన్సర్‌వంటి వ్యాధులొచ్చే అవకాశముంది. మరి కొందరికి గైనిక్ సమస్యలూ వస్తాయి.

– డా.సుమిత కౌర్,
జనరల్ ఫిజీషియన్, కాంటినెంటల్ ఆస్పత్రి

జీర్ణకోశ సమస్యలు...

లిప్‌స్టిక్ కడుపులో చేరిన వెంటనే ఇబ్బంది కలిగించదు. నె మ్మదిగా దాని ప్రభావం జీర్ణకోశ వ్యవస్థపై చూపుతోంది. లిప్‌స్టిక్ మింగిన వారికి ఇరిటేబుల్ వంటి ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయి. లిప్‌స్టిక్‌ను వాడే మోతాదు, సంఖ్యను బట్టి అనారోగ్య సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. రోజుకు మూడు సార్ల కంటే ఎక్కువగా లిప్‌స్టిక్‌ను వినియోగించొద్దు.

– డాక్టర్ అమర్‌నాథ్,
గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, కేర్ ఆస్పత్రి

# మాయదారి జబ్బు మెండికేస్తోంది

విస్తరిస్తున్న ఎండీఆర్ టీబీ ఫ రెట్టించిన శక్తితో బ్యాక్టీరియా ఫ నిర్లక్ష్యం, మందులు వాడకపోవడమే..!

చెస్ట్ ఆస్పత్రికి క్షయ బాధితుల తాకిడి ఫ ఏడాదికి నాలుగు వేల మంది అడ్మిట్ ఫ 30 వేల మందికి ఓపీ చికిత్సలు

నగరం మీద క్షయ మళ్లీ దాడి చేస్తోంది. జబ్బు నిర్ధారణలో ఆలస్యం, మందుల వాడడంలో నిర్లక్ష్యం కారణంగా వేగంగా విస్తరిస్తోంది. జబ్బు కొన్ని సార్లు మందులకు కూడా నయం కాకుండా రోగిని ముప్పుతిప్పలు పెడుతోంది. ఫలితంగా వ్యాధితో మరణించే వాళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రతి నెలాచెస్ట్ ఆస్పత్రికి వచ్చే టీబీ రోగుల సంఖ్య పెరుగుతోంది. మందులకు లొంగని కేసులు (ఎండీఆర్ టీబీ) ఎక్కువగా వస్తున్నాయని వైద్యులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీబీ బ్యాక్టీరియా కొత్త శక్తితో దాడి చేస్తోంది. మందులకు లొంగని ఎండీఆర్ టీబీ విస్తరిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న రోగుల్లో నాలుగుశాతం మంది, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న వాళ్లలో 12 శాతంమంది ఎండీఆర్ టీబీతో సతమతమవుతున్నారు. టీబీ బ్యాక్టీరి యా నిరోధక శక్తిని పెంచుకుని జనంపై దాడి చేస్తోంది. మందులకూ లొంగని స్థాయిలో శక్తివంతంగా మారుతోంది. టీబీని నియంత్రించ డానికి పన్నెండు రకాల మందులను ఉపయోగిస్తామనీ, అయితే కొన్నిసార్లు ఏ మందుకూ బ్యాక్టీరియా లొంగడంలేదని డాక్టర్లు అంటున్నారు.

చెస్ట్ ఆస్పత్రికి రోగుల తాకిడి

చెస్ట్ ఆస్పత్రిలో ప్రతి సంవత్సరం నాలుగు వేల మంది వరకు క్షయ బాధితులు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 250 పడకలున్నాయి. వాటిలో 60 శాతానికిపైగా టీబీ రోగులే ఉంటున్నారు. వాటిలోనూ ఎండీఆర్ టీబీ కేసులే ఎక్కువగా ఉంటున్నాయని వైద్యులు తెలిపారు. చెస్ట్ ఆస్పత్రికి ఏడాదిలో ఓపీ విభాగంలో 30 వేల వరకు కేసులు నమోదవుతున్నాయి. యేటా 16 వేల కొత్త కేసులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

డాట్, డాట్ ప్లస్ ద్వారా మందులు

సాధారణ టీబీ రోగులకు డాట్ కేంద్రం ద్వారా ఉచితంగా మందుల పంపిణీ పంపిణీ చేస్తారు. వాటిని ఎలా వేసుకోవాలో డాట్ నిర్వాహకులు వివరిస్తారు. రోగులు ఆరు నెలల వరకు తప్పనిసరిగా మందులు వేసుకోవాలి. డాట్ ప్లస్‌లో ఎండీఆర్ టీబీ రోగులకు మందులు పంపిణీ చేస్తారు. వీళు ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు మందులు వాడాల్సి ఉంటుంది. డాట్ ప్లస్‌లో 2 లక్షల రూపా యలకు పైగా విలువైన మందులను అందజేస్తారు. ఎవరికైనా టీబీ ఉందన్న అనుమానం ఉంటే తెమడ, రక్త పరీక్షలు చేయించు కోవాలి. ఆ తర్వాత టీబీ కల్చర్ పరీక్ష చేయించుకోవాలి. ఆరు వారాల్లో ఆ నివేదిక వస్తుంది. వేగంగా విషయం తెలియాలంటే టీబీ గోల్డ్ టెస్టు చేయిం చుకోవాలి.



వ్యాధి పెరగడానికి కారణాలు

మొదటి సారి వచ్చిన టీబీకి సరైన చికిత్సలు చేయించుకోకపోవడం

మందులను సక్రమంగా వాడకపోవడం.

వైద్యులు కూడా రోగికి మెరుగైన వైద్యం అందించకపోవడం.

వైద్యులు సూచించిన పౌష్టికాహారం తీసుకోకపోవడం

తరుచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించకపోవడం

వ్యాధి కాస్త తగ్గగానే నిర్లక్ష్యంగా వ్యవహరించడం.

ఖరీదైన మందులను వాడకపోవడం.

షుగర్, హెచ్ఐవీ, కేన్సర్ రోగులకు, స్టెరాయిడ్ వాడుతున్న వారికీ టీబీ వచ్చే అవకాశం ఉంది.

క్షయ కేసులు పెరుగుతున్నాయి

తొమ్మిదేళ్ల క్రితం టీబీ నామమాత్రంగా ఉండేది. ఇప్పుడు మల్టీడ్రగ్ క్షయ పెరిగింది. రోగులకు ఫస్ట్‌లైన్, సెకండ్ లైన్ మందులు ఇస్తాం. ఫస్ట్‌లైన్ మందులను ఆరునెలలు క్రమం తప్పకుండా వినియోగిస్తే పూర్తిగా తగ్గిపోతోంది. చాలా మంది మందులు సరిగ్గా తీసుకోవడంలేదు. మురికివాడలు, బస్తీల్లో టీబీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. మధుమేహం, హెచ్ఐవీ రోగుల్లో టీబీ ఎక్కువగా కనిపిస్తోంది. 25 మంది మధుమేహ బాధితుల్లో అయిదారుగురికి టీబీ వచ్చే ముప్పు ఉంది.

– డాక్టర్ మతీనుద్దీన్, సీనియర్ పల్మనాలజిస్టు, సన్‌షైన్ ఆస్పత్రి

జాగ్రత్తలతో క్షయకు చెక్

కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధి సోకుండా చూసుకోవచ్చు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, పెద్దవాళ్లకు ఈ జబ్బు వచ్చే ముప్పు ఉంది. వ్యాధి సోకినా ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడొచ్చు. క్షయ రోగి ద్వారా 15 నుంచి 20 మందికి జబ్బు వ్యాపించే అకాశముంది. రోగిని విడిగా వేరే గదిలో ఉంచి వైద్యం అందించాలి. పౌష్టికాహారం ఇవ్వాలి. రోజూ మందులు వేసుకునేలా చూడాలి.

## నెలకు 5 రోజులపాటు ప్రత్యేకమైన ఆహారం




మందులు, ఇంజెక్షన్ల గొడవ లేకుండా సహజ పద్ధతులతో మధుమేహాన్ని తగ్గించే ఓ కొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. నెలలో 5 రోజులపాటు ఆహార నియమాలు పాటించడం ద్వారా టైప్-1, టైప్-2 మధుమేహ ఇబ్బందులనుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. అందులో కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు తక్కువ మొత్తంలో ఉండడంతోపాటు ఆరోగ్యకరమైన ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయన్నారు. ఫాస్ట్ మిమికింగ్ డైట్(ఎఫ్ఎండీ)గా వ్యవహరించే ఈ ఆహారం ముఖ్య ఉద్దేశం ఓవైపు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ..శరీరాన్ని మాత్రం ఉపవాసం చేస్తున్న భ్రమలో ఉంచడమేనని తెలిపారు. ఈ తేలికపాటి ఆహారపదార్థాలు శరీరంలోకి చేరినా జీర్ణవ్యవస్థలో పేరుకుపోయే అవకాశం ఉండదని కాలిఫోర్నియా వర్సిటీ పరిశోధకులు వివరించారు. ఉపవాసంవల్ల కలిగే ప్రయోజనాలను దీంతో పొందొచ్చని, ఇది శరీరంలోని వివిధ వ్యవస్థల పనితీరును మెరుగు పరుస్తుందని చెప్పారు. క్లోమగ్రంథి కణాలను ప్రేరేపించి ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందన్నారు. ఈమేరకు ఎలుకలు, మానవ కణాలపై జరిపిన పరిశోధనలో సానుకూల ఫలితాలు సాధించినట్లు లాంగెవిటీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వాల్టర్ తెలిపారు.

## రోజూ 3 గంటలు టీవీ చూస్తే మధుమేహ ముప్పు



రోజుకు 3 గంటలపాటు టీవీ చూడడం లేదా స్మార్ట్ ఫోన్, టాబ్లెట్‌తో ఆడే పిల్లలు భవిష్యత్తులో మధుమేహ బాధితులుగా మారే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం హెచ్చరించింది. గంటల తరబడి స్క్రీన్‌ను చూడడంవల్ల అనారోగ్యాల ముప్పు పెరుగుతుందన్నారు. శరీరంలో కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ నిరోధకత, రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రించే హార్మోన్ విడుదలపై ప్రభావం తదితర దుష్పరిణామాలు ఎదురవుతాయని లండన్ శాస్త్రవేత్తలు వివరించారు. ఈమేరకు యూకే వ్యాప్తంగా 9-10 ఏళ్ల వయసున్న 4500 మంది పిల్లలను పరీక్షించి ఈ విషయాన్ని నిర్ధారించుకున్నట్లు తెలిపారు.

## తుమ్మును ఆపితే మరణమే?



నోటి నుంచి అకస్మాత్తుగా అతి వేగంతో వచ్చే తుమ్మును ఆపితే కొన్ని సందర్భాలలో ప్రాణం పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తుమ్ము ద్వారా శక్తివంతమైన గాలి బయటకు వస్తుందనీ, దీనిని ఆపితే తుమ్ములోని గాలి బుడగలు గుండె, మెదడు కణజాలంలోకి ప్రవేశించి వెంటనే మరణం సంభవించవచ్చని వారు హెచ్చరిస్తున్నారు. మామూలుగా తుమ్ము అనేది అశుభశూచకంగా భావించి దీన్ని బయటకు రాకుండా అడ్డుకుంటారనీ, ఇలా అడ్డుకోవడం అనేది వారి మరణాన్ని వారే ఆహ్వానించుకోవడం అని నిపుణులు చెబుతున్నారు. తుమ్ముద్వారా బయటకు వచ్చే శబ్దం ఇతరులను ఇబ్బంది పెడుతుంది అనుకుంటే నోటిక ఏదైనా అడ్డు పెట్టుకుని తుమ్మాలని వారు సూచిస్తున్నారు. అంతే తప్ప దాన్ని ఆపే ప్రయత్నం చేయడకూడదని వారు సూచిస్తున్నారు.

## పాదరక్షలతో అనారోగ్యం?



అనారోగ్యానికి రకరకాల కారణాలను కనుగొన్న పరిశోధకులు ఇప్పుడు సరైన పాదరక్షలు ధరించకపోతే అనారోగ్యం బారినపడక తప్పదని అంటున్నారు. పాదరక్షల వలన కలిగే సమస్యల గురించి ఇటీవల ఓ పరిశోధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది మీద వీరు అధ్యయనం నిర్వహించారు. వీరిలో చాలా మంది తమ పాదాలకన్నా పెద్దవో చిన్నవో ఉన్న చెప్పులను వేసుకుంటున్న వారే! దీని వలన వారి ఆరోగ్యంలో వస్తున్న మార్పులను చూసి పరిశోధకులు ఆశ్చర్యపోయారు. తమ పాదాల కన్నా తక్కువ ఉండే చెప్పులను వేసుకునే వారు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్టు వీరు గుర్తించారు. నడుస్తూ నడుస్తూ తరచూ అదుపు తప్పి పడిపోవడం, పాదాల నొప్పులు, నడకలో మార్పులు తదితర సమస్యలను గుర్తించారు. ఈ సమస్యలే భవిష్యత్తులో ప్రాణాంతకం కావచ్చని వీరు హెచ్చరిస్తున్నారు. పాదరక్షల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందే! అని వారు సూచిస్తున్నారు.

## మధ్యవయస్కుల్లో 8శాతం మగాళ్లకు మధుమేహం



ఆహార అసమతుల్యత వల్ల దేశంలోని మధ్యవయస్కులు వ్యాధుల బారిన పడుతున్నారు. 15-49 మధ్య వయసున్న దాదాపు 8శాతం మంది పురుషులు, 5.8 శాతం మహిళలు మధుమేహంతో బాధపడుతున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అంతేకాకుండా, 2015-16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం 13.6 శాతం పురుషులు, 8.8 శాతం మహిళలు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని, 13శాతం మంది హైపర్ సెన్సిటివిటీతో ఇబ్బందిపడుతున్నారని కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి అనుప్రియా పటేల్ రాజ్యసభలో సమాధానమిచ్చారు.

## అల్సర్లకు విరుగుడు

ఆకలిగా ఉంటుంది.. ఏదైనా తింటే ముద్ద గొంతు దిగదు. మమకారం కొద్దీ కాస్త కారం తిన్నామా.. అంతే కడుపులో మంట. పుల్లటి తేన్పులు.. ఛాతీలో నొప్పి.. ఈ ఇబ్బందులన్నీ అల్సర్ల కారణంగానే వస్తాయి. కడుపులో అల్సర్లను ఇంటి వైద్యం ద్వారా అరికట్టవచ్చు. ఒక కప్పు మెంతికూర ఆకులను నీళ్లలో ఉడికించాలి. వాటిలో కొద్దిగా ఉప్పు కలపాలి. నీటిని వడగట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తే అల్సర్లు తగ్గుముఖం పడతాయి. క్యాబేజీ రసం తాగడం వల్ల కడుపులోని అల్సర్లు తగ్గిపోతాయి. ఈ రసాన్ని రాత్రి పడుకోబోయే ముందు తాగాలి.

అడపాదడపా అరటిపండ్లు ఆరగించాలి. బనానాలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ పదార్థాలు అల్సర్లను అరికడతాయి. కడుపులో మంట తగ్గించడంలో తేనె బాగా ఉపయోగపడుతుంది. ప్రతి రోజూ బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గ్లాసెడు నీళ్లలో ఒక టేబుల్ స్పూన్ తేనె కలిపి తీసుకుంటే మంచి గుణం కనిపిస్తుంది. కొబ్బరి నీళ్లు అల్సర్లను తగ్గిస్తాయి. పల్చటి మజ్జిగ

## ఒక సినిమాతో ఫ్యూచర్ సినిమాలను చిక్కుల్లో పడేసుకున్న హీరో..!!



తమిళ ఇండస్ట్రీలో హీరో శింబు కష్టాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఇప్పటి వరకు తమిళంలో ఎన్నో సినిమాలు చేసిన శింబు.. కేవలం ఒక సినిమా వలన తేరుకోలేని కష్టం మీదేసుకున్నాడు. కోరి తెచ్చుకుంటే అనుభవించాలి కదా అన్నట్లే ఉంది శింబు పరిస్థితి. కొన్నేళ్లుగా సినిమాలు చేయడం తగ్గించిన శింబు.. ఇటీవల ఈశ్వరన్ సినిమాతో రీఎంట్రీ ఇచ్చాడు. అయితే ఓ సినిమా విషయంలో తమిళ నిర్మాతల మండలి భవిష్యత్తులో శింబు సినిమాలకు ఎలాంటి సహాయం అందించరాదని తీర్మానించి షాక్ ఇచ్చింది. ప్రముఖ నిర్మాత మైఖేల్ రాయప్పన్ కు శింబు చెల్లించాల్సిన బాకీని ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చిందట నిర్మాతల మండలి. అయితే ఈ నిర్ణయం తీసుకోవడం పెద్ద తతంగమే నడిచిందట. శింబు కథానాయకుడుగా నిర్మాత మైఖేల్ రాయప్పన్ నిర్మించిన 'అన్బానవన్ అరసాదవన్ అడంగాదవన్' అనే సినిమాలో నటించాడు. ఈ సినిమా ఆర్థిక కష్టాల టైంలో తానే నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాడు శింబు. ఇక తనకిష్టం వచ్చినట్లు నిర్మించాడట. తీరా సినిమా రిలీజై ఫ్లాప్ అయింది. దీంతో నిర్మాతకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో నిర్మాత హీరో మధ్య కుదిరిన ఒప్పందం మేరకు.. ఓ సినిమాను ఫ్రీగా చేస్తానని ఒప్పుకున్నాడట శింబు. అందుకు సంబంధించిన అగ్రిమెంట్ కూడా చేసుకున్నారట. కానీ శింబు మాట తప్పి సినిమా చేయలేదు. దీంతో నిర్మాత మైఖేల్ రాయప్పన్ నిర్మాతల మండలికి ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాతల మండలి.. ఇరువర్గాలను పిలిచి సంప్రదింపులు జరిపారు. నిర్మాతల మండలి చెప్పిన దాన్ని బట్టి శింబు ఒక సినిమా ఫ్రీగా చేయాలి లేదా 6.60 కోట్లను మూడు దఫాలుగా ఆ నిర్మాతకు చెల్లించాలని మండలి తీర్మానించింది. ఈ ఒప్పందంపై శింబు సంతకం చేసాడట. కానీ శింబు ఒప్పందాన్ని ఉల్లఘించి.. ఏది చేయకపోవడంతో సీరియస్ అయిన నిర్మాతల మండలి శింబు భవిష్యత్తులో నటించే సినిమాలకు ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదనే నిర్ణయం ప్రకటించింది. ఈ దెబ్బకు శింబు తన కెరీర్ తానే చిక్కుల్లో పడిసుకుంటున్నాడని అర్థమవుతుంది. చూడాలి మరి మళ్లీ ఏదైనా పరిష్కారం ఆలోచిస్తాడేమో..!!

## రాధిక నా తల్లి కాదు.. నన్ను ఇబ్బంది పెట్టింది - వరలక్ష్మీశరత్ కుమార్



ఫ్యామిలీ బ్యాగ్రౌండ్తో సినీ ఇండస్ట్రీలోకి చాలా మందే ఎంట్రీ ఇస్తుంటారు.. కానీ కొందరే నిలదొక్కుకుంటారు. అలాంటి వారిలో ఒకరు కోలీవుడ్ నటి వరలక్ష్మి. హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి.. అద్భుతమైన క్యారెక్టర్ ఆర్టిస్టుగా దూసుకెళ్తోంది. లేటెస్ట్ గా రవితేజ చిత్రం 'క్రాక్'లో జయమ్మ పాత్ర పోషించిన వరలక్ష్మి.. ప్రేక్షకులను భయపెట్టింది. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తన ఫ్యామిలీ సీక్రెట్స్ వెల్లడించింది.

**తొలి ఎంట్రీ..**

కోలీవుడ్ సీనియర్ హీరో శరత్ కుమార్ కూతురే వరలక్ష్మి. అయితే.. రాధిక కూతురు కాదు. మొదటి భార్యకు జన్మించింది. నటన మీద ఎంతో ఇష్టంతో చదువు పూర్తికాగానే.. సినిమాల్లోకి వచ్చినట్టు చెప్పింది. 'పోడా పొడి' అనే సినిమాతో హీరోయిన్గా పరిచయమై.. ఆ తర్వాత కన్నడ సినిమాల్లోకి ప్రవేశించి దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ మెప్పిస్తోంది వరలక్ష్మి.

**విలక్షణ పాత్రల్లో..**

కెరీర్ ఆరంభంలోనే విలక్షణ నటనతో ఎంతో మెప్పించింది వరలక్ష్మీ శరత్ కుమార్. అన్ని భాషల్లోనూ అదే తరహా నటనతో ఆకట్టుకుంటోంది. ప్రధానంగా.. 'విక్రమ్ వేదా' 'విస్మయ' 'మానిక్యా' 'కసాబా' వంటి చిత్రాల్లో అద్భుతమైన యాక్టింగ్ తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక 'పందెం కోడి 2' 'సర్కార్' వంటి చిత్రాల్లో లేడీ విలన్గానూ కనిపించి సత్తాచాటింది.

**తెలుగులోనూ..**

సందీప్ కిషన్ నటించిన 'తెనాలి రామకృష్ణ' సినిమా ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది వరలక్ష్మీ శరత్ కుమార్. ఈ సినిమా పెద్దగా ఆడకపోవడంతో సరైన గుర్తింపు దక్కలేదు. కాగా.. ఇటీవల రవితేజ చిత్రం 'క్రాక్'లో ఆమె పోషించిన జయమ్మ పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ రోల్లో భయంపెట్టే నటనతో ప్రశంసలు అందుకుంటోంది.

**హీరో విశాల్తో బ్రేకప్..**

ఇక తమిళ స్టార్ హీరో విశాల్ తో ప్రేమలోపడింది ఈ బ్యూటీ. చాలా కాలం పాటు వీరిద్దరూ రహస్యంగా చెట్టాపట్టాలేసుకుని తిరిగారు. ఆ తర్వాత అందరికీ తెలిసేలా లవ్ జర్నీకంటిన్యూ చేశారు. ఈ క్రమంలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. కానీ.. ఏమైందో తెలీదు తమ లవ్ మూవీకి ఎండ్ కార్డ్ వేసేశారు.

**రాధిక అలాంటిది..**

తన సవతి తల్లి రాధిక గురించి భిన్నమైన కామెంట్స్ చేసింది వరలక్ష్మి. 'ఆమె నా తల్లి కాదు. కానీ.. నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటుంది. నా కెరీర్కు సంబంధించిన ఎన్నో సూచనలు ఇస్తూ ఉంటుంది. అయితే.. నేను ఆమెకు ఏదైనా రహస్యం చెబితే.. దాన్ని వెంటనే లీక్ చేసేస్తుంది. అలా నన్ను చాలా సార్లు ఇబ్బంది పెట్టింది.' అని తెలిపింది వరలక్ష్మి. అయితే.. అందులో దురుద్దేశం లేదని చెప్పింది. సీక్రెట్లు ఆమె కావాలని చెప్పదు. పొరపాటున జరిగిపోతుంది' అని వివరించింది వరలక్ష్మి.

## ధనుష్ సరసన మరోసారి జోడీగా..



హీరో ధనుష్, దర్శకుడు సెల్వరాఘవన్ కాంబినేషన్లో తెరకెక్కనున్న 'నానే వరువేన్' అనే యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి ఇప్పుడు నటీనటుల ఎంపిక జరుగుతోంది. ఇందులో భాగంగా తొలుత హీరోయిన్ కోసం పలువురు హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నారు. ఈ లిస్టులో తమన్నా పేరు తెరపైకి వచ్చింది. ఈ చిత్ర కథకు అనుగుణంగా తమన్నాను తీసుకోవాలన్న ఆలోచనలో దర్శకుడు సెల్వరాఘవన్ కూడా వున్నట్టు సమాచారం. అలాగే దనుష్ సైతం తమన్నాకు ఓకే చెప్పినట్టు వినికిడి. తమన్నా కూడా సినిమాలో నటించడానికి ఓకే చెప్పినట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. అయితే, దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్ థాను నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చుతుండగా, అరవింద్ కృష్ణన్ సినిమాటోగ్రాఫర్గా పనిచేయనున్నారు. గతంలో ధనుష్తో కలిసి తమన్నా 'పడిక్కాదవన్', 'వేంగై' అనే చిత్రాల్లో నటించింది.

## స్టార్ హీరో మరో సాహస యాత్ర.. ఈసారి రికార్డ్ బ్రేక్

తమిళ సూపర్ స్టార్ అజిత్ కు బైక్ డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం అనే విషయం అందరికి తెల్సిందే. చిన్న హీరోలు కూడా ప్రస్తుతం బైక్ పై తిరిగేందుకు ఇష్టపడరు. కాని అజిత్ మాత్రం వందలు వేల కిలో మీటర్లు బైక్ పై తిరిగేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటాడు. ఈ వయసులో కూడా అజిత్ ఇంకా రెగ్యులర్ గా బైక్ డ్రైవ్లు చేస్తూనే ఉంటాడు. లాక్డౌన్ సమయంలో హైదరాబాద్ నుండి చెన్నై వరకు అజిత్ బైక్ పై వెళ్లాడు అంటూ వార్తలు వచ్చాయి.



అందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇక ఇప్పుడు వారణాసి ఇంకా ఉత్తర భారతంకు బైక్ రైడ్ చేస్తున్నాడు. అజిత్ ఇప్పటికే 4500 కిలో మీటర్లను బైక్ పై ట్రావెల్ చేసి చేరుకున్నారు. వారణాసిలో బైక్ తో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇంత భారీ రైడ్ను ఏ ఒక్క హీరో కూడా చేయలేదు అనడంలో సందేహం లేదు. ఒక హీరోగా ఇంత రైడ్ చేయడం రికార్డ్ గా చెప్పుకోవచ్చు. అద్భుతమైన రికార్డును తన సొంతం చేసుకున్న అజిత్ త్వరలో వినోథ్ హెచ్ దర్శకత్వంలో రూపొందుతున్న వలిమై సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. వలిమై సినిమా షూటింగ్ ఎక్కువ శాతం హైదరాబాద్లోనే చిత్రీకరణ జరిపారు.

## అడ్వాన్సులు వెనక్కి తీసుకున్న వాళ్ల సీనేంటి రాజా?



సంక్రాంతి కానుకగా రిలీజైన క్రాక్ చక్కని మౌత్ టాక్ సహా సమీక్షకుల ప్రశంసలతో బంపర్ హిట్ కొట్టడం పరిశ్రమలో చర్చనీయాంశమైంది. హిట్టు వెంట పడే పరిశ్రమ అప్పటి వరకూ వరుస ఫ్లాపుల మీద ఉన్న మాస్ రాజాను కూడా పక్కకు పెట్టింది. కొందరు పారితోషికం అడిగినంతా ఇవ్వలేమని తిరస్కరిస్తే.. మరికొందరు ఇచ్చిన అడ్వాన్సులే వెనక్కి లాక్కున్నారన్న టాక్ కూడా వినిపించింది. ఇంకొందరు ఏకంగా మాస్ మహారాజా స్థానంలో వేరే హీరోని ఎంపిక చేయడం కూడా సర్వత్రా వేడెక్కించింది. అయితే ఇప్పుడు రాజా ట్రాక్ లోకొచ్చాడు. బ్లాక్ బస్టర్ తో మైండ్ బ్లాక్ అయ్యే ట్రీటిచ్చాడు. అది కూడా కోవిడ్ నియమనిబంధనల నడుమ.. 50శాతం ఆక్యుపెన్సీతో గొప్ప ఫలితం అందుకుని అందరికీ షాకిచ్చాడు. 2021 సంక్రాంతి విజేతగా మాస్ రాజా ప్రశంసలు అందుకుంటున్నాడు. దీంతో ఇప్పుడు వరుసగా పలువురు నిర్మాతలు రవితేజను సంప్రదించారని తెలిసింది. అన్నట్టు ఇంతకుముందు రవితేజకు అడ్వాన్సులు ఇచ్చి తిరిగి తీసుకున్న నిర్మాతల పరిస్థితేమిటో? అన్న చర్చా ఇప్పుడు వేడెక్కిస్తోంది. జీఏ2.. యువి క్రియేషన్స్ వంటి సంస్థలతో రవితేజ సినిమాలు చేయాల్సి ఉండగా అవన్నీ ఆగిపోవడం అవ్వడం అప్పట్లో చర్చనీయాంశమైంది. మారుతి దర్శకత్వంలోనే రవితేజ నటించాల్సి ఉండగా ఆ ప్లేస్ ని గోపిచంద్ తో యువి నిర్మాతలు రీప్లేస్ చేశారన్న టాక్ కూడా వినిపించింది. మరి విజయంతో కంబ్యాక్ అయిన మాస్ రాజాతో వీళ్లంతా సినిమాలు చేస్తారా? అన్నది ఇప్పటికి సస్పెన్స్.

## వైరల్ అవుతున్న స్టార్ హీరోయిన్ ఫిట్నెస్ ఫ్రీక్ వీడియో!!



టాలీవుడ్ వయ్యారి రకుల్ ప్రీత్ సింగ్ ఫిట్నెస్ కి ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో చెప్పక్కర్లేదు. ఎందుకంటే ఆమె సినిమా సినిమాకు తీసుకునే కేర్.. ఫిట్నెస్ రూపంలో కనిపిస్తుంది. ఫిట్నెస్ విషయంలో రకుల్ ఎంతోమంది ఇండస్ట్రీ వారికి ఇండస్ట్రీ బయటవారికి స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పవచ్చు. అమ్మడిని ఫిట్నెస్ అంశంలో ఫాలో అయ్యే కుర్రకారు లక్షలలో ఉన్నారు. ఫిట్నెస్ విషయానికి వస్తే రకుల్ అసలు అలుపులేకుండా శ్రమిస్తుంది. ఏ రోజు కూడా తను వ్యాయామం జిమ్ లాంటి శారీరక వ్యాయామలకు బ్రేక్ ఇవ్వదు. ఎల్లప్పుడూ ఉత్సాహంగా కనిపించే రకుల్ తన వారం ఎలా ప్రారంభించిందో.. క్లుప్తంగా ఇంస్టాగ్రామ్ వీడియో ద్వారా షేర్ చేసుకుంది. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు అలెర్ట్ గా ఉండే రకుల్.. పోస్ట్ చేసిన వీడియోలో వెయిట్ గల స్క్వాట్స్ చేయడం చూడవచ్చు. రోజు తన దినచర్యను ఎలా ఫాలో అవుతుందో చెప్పుకొచ్చింది. అంతేగాక "లైఫ్ ఎప్పుడు హెచ్చు తగ్గులను కలిగి ఉంటుంది. నేను దానిని స్క్వాట్స్ అని పిలుస్తాను" అంటూ రాసుకొచ్చింది. ఇదిలా ఉండగా.. రకుల్ త్వరలో అమితాబ్ బచ్చన్ అజయ్ దేవగన్ సినిమాలో నటించేందుకు సిద్ధం అవుతుంది. ఈ సినిమాకు మేడే అనే పేరును ఖరారు చేశారు. అయితే ఈ సినిమాలో రకుల్ పైలట్ పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాను హీరో అజయ్ దేవగన్ నిర్మిస్తూనే దర్శకత్వం వహించడం కూడా విశేషం. ఇక అజయ్ దేవగన్ సరసన రకుల్ ప్రీత్ నటించడం ఇది రెండోసారి. ఇదివరకు వీరిద్దరి కాంబినేషన్ లో 'దేదే ప్యార్ దే' అనే సినిమా విడుదలైన సంగతి తెలిసిందే. ఇవేగాక రకుల్ చేతిలో పలు తమిళ ప్రాజెక్టులు తెలుగు ప్రాజెక్ట్స్ ఉన్నాయట. అమ్మడు మళ్లీ ఫామ్ కొనసాగించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. చూడాలి మరి రకుల్ ఏం చేస్తుందో..!

## 'ఏ' అంటే అతనే.. లవర్ పేరు చెప్పిన మోనాల్..!



సుడిగాడు, బ్రదర్ ఆఫ్ బొమ్మాళి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటి మోనాల్ గజ్జర్. ఈ సినిమాల తర్వాత 2015 చివర్లో సౌత్ ఇండస్ట్రీని వదిలేసి వెళ్లింది మోనాల్. పలు ఆఫర్లు వచ్చినా ఇక్కడ నటించలేదట. చాలా కాలం తర్వాత ఇటీవల బిగ్ బాస్ హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే.. అలా వెళ్లిపోవడానికి కారణం తన ప్రియుడే అంటోంది మోనాల్! బిగ్ బాస్ హౌస్లో ఉన్నన్నాళ్లూ తన మన సులో ఉన్నది 'ఏ' మాత్రమేనని చెప్పింది మోనాల్. దీంతో.. ఎ అంటే అభిజిత్ అని కొందరు.. అఖిల్ అంటూ మరికొందరు అను కున్నారు. కానీ.. క్లారిటీ ఇవ్వలేదు మోనాల్. పైగా.. ఎ అంటే యాపిల్ అంటూ ఇష్యూనీ దాటేసింది. అయితే.. తాజాగా ఎ అంటే క్లారిటీ ఇచ్చేసింది. ఎ అంటే 'ఆర్యన్' అని చెప్పిందీ గుజరాత్ బ్యూటీ. ఇతనితో దాదాపు ఐదేళ్లకుపైగా లవ్ జర్నీ కంటిన్యూ చేశానని చెప్పింది. సుడిగాడు సినిమా తరువాత వచ్చిన మలయాళం ఆఫర్ తో మోలీవుడ్ లోకి వెళ్లానని అక్కడి హీరోతో పరిచయం ఏర్పడి రిలేషన్ షిప్లో ఉన్నట్టు చెప్పింది మోనాల్. అతనే మలయాళీ హీరో ఆర్యన్. అతనితో దాదాపు ఐదారేళ్లు డేటింగ్ చేసిన తర్వాత అనివార్యమైన పరిస్థితుల్లో 2016లో బ్రేకప్ అయినట్లు చెప్పింది. దీంతో తీవ్ర ఆవేదనకు గురై గుజరాత్ వెళ్లిపోయానని మోనాల్ వెల్లడించింది. ఆర్యన్ సౌత్ ఇండస్ట్రీ కి చెందిన వ్యక్తి కావడంతో ఇక సౌత్ ఇండస్ట్రీకి రాలేకపోయానని చెప్పారు. అక్కడే గుజరాతీ సినిమాలు చేస్తూ ఉండిపోయినట్ల తెలిపింది మోనాల్. ఆర్యన్ విషయానికి వస్తే.. అతను మలయాళ హీరో. వీరిద్దరూ కలిసి 2012లో 'డ్రాకులా' అనే మలయాళ త్రీడీ సినిమాలో నటించారు. ఇదే సినిమాను తెలుగులో 'పున్నమి రాత్రి'గా డబ్ చేశారు. ఈ సినిమా 2016లో తెలుగులో విడుదలైంది. మొత్తానికి.. బిగ్ హౌస్ లో కొనసాగినంత కాలం తన సీక్రెట్ ను ఎవరికీ చెప్పకుండా దాచిపెట్టిన మోనాల్.. ఇప్పుడు రివీల్ చేసింది.

## 'గని' గా బాక్సింగ్ రింగ్ లో దిగుతున్న వరుణ్ తేజ్..!

మెగా హీరో వరుణ్ తేజ్ బాక్సింగ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఓ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. నేడు వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 10 గంటల 10 నిమిషాలకు 10 ఫస్ట్ లుక్ విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ముందుగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈ సినిమా ఫస్ట్ లుక్ మరియు మోషన్ పోస్టర్ ని రిలీజ్ చేసి వరుణ్ కి బర్త్ డే విషెస్ తెలియజేసారు. మెగా ప్రిన్స్ బాక్సర్ గా నటిస్తున్న ఈ చిత్రానికి "గని" అని టైటిల్ ని ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ లో బాక్సింగ్ రింగ్ లో దిగిన బాక్సర్ గా వరుణ్ తేజ్ ని చూపించారు.



దీనికి మ్యూజిక్ డైరెక్టర్ థమన్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. జార్జ్ సి. విలియమ్స్ సినిమాటోగ్రాఫర్గా వ్యవహరించారు. 'గని' చిత్రంతో కొర్రపాటి కిరణ్ కుమార్ అనే డెబ్యూ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో రెనసాన్స్ ఫిలింస్ – అల్లు బాబీ పిక్చర్స్ పతాకాలపై అల్లు బాబీ – సిద్ధు ముద్ద కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో హీరో పేరు 'గని' కావడం వల్ల ఈ చిత్రానికి అదే టైటిల్గా పెట్టినట్లు తెలుస్తోంది. 'బాలు' సినిమాలో పవన్ కళ్యాణ్ పేరు 'గని' అనే విషయం తెలిసిందే. ఇప్పుడు బాబాయ్ పేరునే అబ్బాయ్ సినిమా టైటిల్గా పెట్టుకున్నాడు. ఇకపోతే ఈ సినిమాలో వరుణ్ తేజ్ బాక్సర్ గా కనిపించడం కోసం స్పెషల్ డైట్ ను పాటిస్తూ ఫిట్నెస్ ని మెయింటైన్ చేయడమే కాకుండా.. ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నాడని తెలుస్తోంది. సయీ మంజ్రేకర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతిబాబు – కన్నడ స్టార్ ఉపేంద్ర – బాలీవుడ్ స్టార్ సునీల్ శెట్టి కీలక పాత్రల్లో నటించనున్నారు. 'గని' చిత్రాన్ని 2021 జూలై లో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com